# 6.46 లక్షల మందికి పనిలేదు

● నిరుద్యోగ నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు ● పూర్తయిన వర్క్‌ఫ్రం సర్వే



ఇళ్ల వద్దనే ఉంటూ పనిచేసే విధానం తీసుకువస్తామని సీఎం చంద్రబాబునాయుడు సార్వత్రిక ఎన్నికల సమయంలో వెల్లడించారు. ఇంటి పని విధానాన్ని విస్తృత పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. వివిధ సంస్థల ద్వారా ప్రస్తుతం ఇళ్ల నుంచి పనిచేస్తున్న వారికి మెరుగైన సదుపాయాలు కల్పించాలని నిర్ణయించింది. ఏ పని లేనివారిని గుర్తించి వారికి నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ఆ మేరకు 18 నుంచి 50 సంవత్సరాల లోపు వారి వివరాల సేకరణకు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది చేపట్టిన వర్క్‌ఫ్రం హోం సర్వే దాదాపు పూర్తయింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 5,25,506 కుటుంబాలను వర్క్ ఫ్రం హోం సర్వేలోకి తీసుకున్నారు. అందులో 18 నుంచి 50 ఏళ్లలోపు వారు 11,30,127 మంది ఉండగా.. ఇప్పటి వరకు 11,28,269 మంది వివరాలను నమోదు చేశారు. సర్వేలో ఆసక్తిగల వివరాలు వెలుగు చూశాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన వయసు వారిలో ఎటువంటి పనిలేకుండా 6,46,236 మంది ఖాళీగా ఉన్నట్లు తేల్చారు.

**ఇదీ లెక్క**

కుటుంబాలు: 5,25,506
జనాభా: 11,30,127 మంది
సర్వే పూర్తయిన వారు: 11,28,269
పని చేసేవారు: 2,35,499
పనిలేని వారు: 6,46,236
ఇంటి నుంచే పని ఆశించేవారు: 2.52 లక్షల మంది

## వర్క్ ఫ్రం హోంకు ఆసక్తి

వర్క్ ఫ్రం హోంకు 2,52,599 మంది ఆసక్తి చూపుతున్నారు. అయితే 36,927 మంది ఏదో ఒక రంగంలో పనిచేస్తున్నారు. నిరుద్యోగాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులోభాగంగా మొదటి విడత బీటెక్ పూర్తిచేసిన వారికి పనిచూపించేందుకు సామర్థ్య పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఏ ఉపాధి లేని వారిని గుర్తించి వారందరికి ఆసక్తి గల రంగంలో శిక్షణ ఇప్పించి నైపుణ్యం పెంచేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఇక తగిన విద్యార్హతలు ఉన్నవారు ఇళ్ల నుంచే పని చేసుకునేలా (వర్క్ ఫ్రం హోం) వివిధ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. జిల్లాలో ఏ పనిలేనివారు 6,46,236మంది ఉన్నట్లు తేల్చారు. ఇక, ఇంటర్నెట్ సదుపాయం ఉన్నవారిని పరిశీలిస్తే బ్రాడ్‌బ్రాండ్ 16,339మంది ఇళ్లలో ఉంది. వైఫై 11,494 మంది ఇళ్లలో ఉంది. వర్క్‌ఫ్రం హోం ఆసక్తి ఉన్న వారికి భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.



తిరుపతిలో వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది (ఫైల్ ఫొటో)

### ఎంత మంది.. ఏం చదివారంటే..

జిల్లాలో 1 నుంచి 9వ తరగతి వరకు చదివిన వారి సంఖ్య 26,252. 36,814 మంది పదో తరగతి చదివారు. ఇక, ఇంటర్ 41,323 మంది, డిప్లొమా 13,534 మంది, డిగ్రీ 60,920 మంది, ఇంజనీరింగ్ 32,705 మంది, ఎంబీబీఎస్ 541, లా (బీఎల్) 394, పీజీ 22,466 మంది, పీహెచ్‌డీ 583 మంది పూర్తి చేశారు. ఇతరులు 8,409 మంది ఖాళీగా ఉన్నారు. నిరక్షరాస్యులు 8,658 మంది ఉన్నారు.




‘ఆపరేషన్ సిందూర్’లో పాల్గొన్న భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ సిటిజన్స్ ఫర్ నేషన్ సెక్యూరిటీ పేరిట బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ నేతృత్వంలో శుక్రవారం తిరుపతిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎంఆర్‌పల్లె సర్కిల్ నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు పొడవాటి జాతీయ జెండాను రెపరెపలాడిస్తూ, భారత్ మాతాకి జై అంటూ నినదించారు. ఈ ర్యాలీలో టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, కార్పొరేటర్లు ఎస్కే. బాబు, నారాయణ, టీడీపీ నేతలు మహేష్ యాదవ్, ఆముదాల తులసీరాం, బీజీ కృష్ణ యాదవ్, జేడబ్ల్యూ విజయ కుమార్, కందాటి సురేష్, మన్నెం శ్రీనివాసులు, బీజేపీ నాయకులు నవీన్‌కుమార్ రెడ్డి, గుండాల గోపీనాథ్, మునిసుబ్రమణ్యం, గాలి పుష్పలత, జల్లి మధుసూదన్, జనసేన నాయకులు దేవర మనోహర్, వనజ, బాలసుబ్రమణ్యం, వర్తక సంఘ ప్రతినిధులు పరదాల మణి, వేదం ప్రభాకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

# బెయిలొచ్చిందా.. తిరిగొస్తే ఒట్టు!



● తప్పించుకు తిరుగుతున్న 920 మంది గంజాయి బ్యాచ్
● నిందితుల్లో ఇతర రాష్ట్రాల వారే అధికం
● ప్రత్యేక బృందాలతో గాలింపు

బెయిల్‌తో బయటకొచ్చే గంజాయి బ్యాచ్.. మళ్లీ కనిపించడం లేదు. కోర్టు విచారణకు రావడంలేదు. ఇలా ఉమ్మడి జిల్లాలో బెయిల్ పొందిన వారిలో ఒకా 920 మంది తప్పించుకు తిరుగుతున్నారు. వీరికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ నిందితుల్లో అత్యధికులు ఇతర రాష్ట్రాల వారే.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

గత ఐదు సంవత్సరాల్లో గంజాయి కేసుల్లో పట్టుబడి జైలుకు వెళ్లారు. కొంత కాలం జైళ్లలో ఉండి.. బెయిల్‌పై బయటకు వస్తున్నారు. ఆ తర్వాత కోర్టు విచారణకు హాజరు కావడంలేదు. దీనిపై విచారిస్తున్న న్యాయమూర్తులు నిందితులకు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేస్తున్నారు. వారిలో చాలా మంది జాడ కూడా కనిపించడంలేదు. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన వారిని విచారించే సమయంలో మరికొందరు బయట వ్యక్తుల ప్రమేయమూ వెలుగు చూస్తోంది. పోలీసులు వారిపైనా కేసులు నమోదు చేస్తున్నారు. అరెస్టు చేయడానికి వెళ్తే పత్తా లేకుండా పోతున్నారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 1020 మంది గంజాయి నిందితులు తప్పించుకుని తిరుగుతుండగా.. ఏడాది కాలంలో దాదాపు 100 మందిని పట్టుకున్నారు. మిగిలిన 920 మంది కోసం ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలిస్తున్నారు. ఇలా తప్పించుకుని తిరుగుతున్న వారిలో ఇతర రాష్ట్రాల వారు.. ముఖ్యంగా తమిళనాడుకు చెందిన వాళ్లు అధికంగా ఉన్నట్లు పోలీసు గణాంకాలు చెబుతున్నాయి. కోర్టు వాయిదాలకు హాజరు పరచాలని సమన్లు జారీ అవుతున్నా నిందితుల ఆచూకీ దొరకడంలేదు. దీంతో కేసుల పురోగతి ముందుకు సాగడంలేదు.

### 102 మందిపై గంజాయి షీట్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 102 మంది స్మగ్లర్లపై గంజాయి షీట్లు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. కూటమి అధికారంలోకి వచ్చాక గంజాయిపై ఉక్కుపాదం మోపింది. ఉమ్మడి జిల్లా పరిధిలో గత తొమ్మిది నెలల వ్యవధిలో దాదాపు పది వేల కిలోల గంజాయిని పట్టుకున్నారు.ఇందులో 310 మందికి పైగా అరెస్టు అయ్యారని సమాచారం. ఒకటి కంటే ఎక్కువసార్లు పట్టుబడుతున్న వారిపై గంజాయి షీట్లు తెరిచారు. మరో 20 కేసుల్లో నిందితులపై పీడీ యాక్టు నమోదు చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

## అనుమానితులు కనిపిస్తే సమాచారమివ్వండి

● తిరుమలలో స్థానిక మహిళలకు భద్రతాధికారుల సూచన



మహిళలతో మాట్లాడుతున్న పోలీసులు

తిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఎవరైనా అనుమానితంగా కనిపిస్తే తమకు సమాచారమివ్వాలని భద్రతాధికారులు స్థానిక మహిళలను కోరారు. తిరుమలలో శుక్రవారం భద్రతా తనిఖీలు జరిగాయి. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో వన్, టూటౌన్ పోలీసులు, విజిలెన్స్, డాగ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీనగర్, కంచి, పుష్పగిరి, ఉడిపి, కాశీ, శృంగేరి శంకర మఠాలు, గుబ్బా చౌల్ట్రీ, ఎస్వీ మ్యూజియం, ఆర్బీ సెంటర్, గోల్డెన్ బాలాజీ హోటల్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా తిరుమలలో నివాసముంటున్న స్థానిక మహిళలు, వృద్ధులతో మాట్లాడారు. మహిళలు శక్తి యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే మీ రక్షణ పోలీసుల చేతుల్లో ఉంటుందని వివరించారు. పలు భవనాల్లో ఫైర్ సేఫ్టీ విధానాలను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని ఫిన్స్ ద్వారా విచారించారు.

# నేటి పాలకులకు రాజ్యాంగమంటే గౌరవమేదీ?

● ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ




తిరుపతి(విద్య), మే 16(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగమంటే ఏమాత్రం గౌరవంలేని శక్తులే నేడు దేశాన్ని పాలిస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి, ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల ఆహ్వానసంఘం అధ్యక్షుడు కె.నారాయణ విమర్శించారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన రెండోరోజు ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల్లో ఆయన మాట్లాడారు. గవర్నర్ల అధికారాల విషయంలో సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలను రాష్ట్రపతి ఖండించిన తీరు చూస్తుంటే రాజ్యాంగానికి ముప్పు పతాకస్థాయికి చేరిందని అర్థమౌతోందన్నారు. ఈ పరిణామాల పట్ల యువత అప్రమత్తం కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం ఇచ్చిన విద్య, వైద్యం, ప్రాథమిక హక్కుల పరిరక్షణ, అమలుకు అవిశ్రాంతంగా పోరాడుతున్న సంస్థ ఏఐవైఎఫ్ అని చెప్పారు. మతతత్వానికి వ్యతిరేకంగా లౌకికవాదం, ప్రజాస్వామ్యంకోసం పోరాడుతోందన్నారు. ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని విస్మరించడంపై యువ రైతులు పోరాటాలకు సిద్ధం కావాలని అఖిలభారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. ఇటీవల 13 నెలలపాటు జరిగిన చారిత్రాత్మక రైతు ఆందోళనలో పెద్దసంఖ్యలో యువ రైతులు పాల్గొనడంవల్లనే ఆందోళన ఉద్యమ రూపందాల్చి కేంద్రప్రభుత్వ మెడలు వంచిందని గుర్తు చేశారు. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టుపెట్టి తనకు అనుకూల పెట్టుబడిదారులైన అదానీ, అంబానీల లాభంకోసం మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని ఆర్‌వైఏ అఖిల భారత ఉపాధ్యక్షుడు సుందర్‌రాజన్ విమర్శించారు. సుఖ్‌జిందర్ మహేసరి, వలీ ఉల్లాఖాద్రి, అరుణ్, లెనిన్, ఆర్తి అధ్యక్షవర్గంగా వ్యవహరించిన రెండోరోజు సభలో ఏఐవైఎఫ్ జాతీయ నాయకులు జగదీష్‌కుమార్, ఏఐటీయూసీ జాతీయ కార్యవర్గ సభ్యులు బీవీవీ కొండలరావు,డీవైఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు రహీం, ఎస్ఎఫ్‌డబ్ల్యు ప్రధాన కార్యదర్శి నిషాసిద్ధూ, బీఎంకేయూ జాతీయ అధ్యక్షులు పెరియార్‌స్వామి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ‘ఎన్నికల సంస్కరణలు, రాజ్యాంగం, పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్యం’పై హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ప్రసంగించారు.

### యువతరమా మేలుకో..

‘దేశ్ అచ్చాహై అన్నావ్ మోదీ.. దేశ ప్రజలు సచ్చేలా ఉన్నారంటూ మోదీ పాలనలో కష్ట నష్టాలపై తెలంగాణకు చెందిన విప్లవ గాయకుడు పాట పాడారు. యువతరమా మేలుకో... మగత నిద్ర మానుకో అనే పాట యువతరాన్ని ప్రేరేపించింది. పల్లె నరసింహ, ధర్మేంద్ర తమ పాటలతో హుషారు తెప్పించారు.

## రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని..!



తిరుమల ఆలయం ముందు ఇస్రో ఛైర్మన్, అధికారులు - చెంగాళమ్మ ఆలయంలో..

తిరుమల/సూళ్లూరుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని షార్ నుంచి ఆదివారం జరిగే రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల శ్రీవారి ఆలయం, శ్రీకాళహస్తీశ్వరాలయం, సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ నమూనాకు ప్రత్యేక పూజలు చేయించారు. శాస్త్రవేత్తలతో కలిసి ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ఈ మూడు ఆలయాలను సందర్శించారు. సూళ్లూరుపేటలో ఆలయ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి స్వాగతం పలకగా.. పూజలనంతరం వేదపండితులు ఇస్రో ఛైర్మన్‌కు ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. నిర్దేశిత సమయానికే ఆదివారం ఉదయం 5.59 గంటలకు పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ ప్రయోగం జరుగుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఇస్రో ఛైర్మన్‌తోపాటు షార్ డైరెక్టర్ డాక్టర్ రాజరాజన్, ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ ఏకే పాత్ర, ఇస్రో డైరెక్టర్ డాక్టర్ శివానందన్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ గుప్తా, అడ్మిన్ ఆఫీసర్ డాక్టర్ అభిషేక్, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు ఉన్నారు.

## గంటలో దర్శనం అని చెప్పి ఉచిత క్యూలో పంపారు

● బెంగళూరుకు చెందిన వర్ష ట్రావెల్స్‌పై భక్తుల ఫిర్యాదు



ట్రావెల్స్ ప్రతినిధులు ఇచ్చిన టికెట్లను చూపుతున్న బెంగుళూరు భక్తబృందం

తిరుమల, మే16(ఆంధ్రజ్యోతి): ఒక ట్రావెల్స్ సంస్థ కేవలం గంటలోనే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కల్పిస్తామని చెప్పి తీసుకువచ్చి చివరకు ఉచిత దర్శనం క్యూలో పంపారని బెంగళూరుకు చెందిన భక్తబృందం ఆవేదన వ్యక్తం చేసింది. వారు తెలిపిన వివరాల ప్రకారం బెంగళూరుకు చెందిన వర్ష ట్రావెల్స్ అనే సంస్థ బెంగళూరుకు నుంచి తిరుమలకు రానుపోను, టిఫిన్, భోజనం, వసతి వంటి సౌకర్యాల కల్పన కోసం ఒక్కొక్కరి నుంచి రూ.3,600 తీసుకుంది. బస్సులో 36 మంది భక్తులు శుక్రవారం తిరుపతికి చేరుకున్నారు. వీరికి ఉదయం టిఫిన్ పెట్టించి జీపుల ద్వారా తిరుమలకు తీసుకువచ్చారు. వీరిని కృష్ణతేజ సర్కిల్ వద్ద ఉచిత క్యూలైన్ దగ్గర వదిలిపెట్టారు. ట్రావెల్స్ ఇచ్చిన టికెట్‌లను అక్కడ విధుల్లో ఉన్న భద్రతా సిబ్బందికి భక్తులు చూపించగా ఇవి దర్శన టికెట్లు కాదని తేల్చిచెప్పారు. మీరు ఉచిత దర్శనం క్యూలైన్‌లోకి ప్రవేశిస్తే దాదాపు 10 గంటల తర్వాత దర్శనం అవుతుందని వివరించారు. దీంతో భక్తబృందం ఆగ్రహం వ్యక్తం చేసింది. గంటలోనే దర్శనం చేయిస్తామని ఇలా మోసం చేశారని కొందరు విజిలెన్స్ వారికి ఫిర్యాదు చేశారు. కేసును తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించారు. అయితే ట్రావెల్స్ టికెట్‌పై ‘ఫ్రీ దర్శనం’ అని మాత్రమే రాసి ఉండటం గమనార్హం. ట్రావెల్స్ ప్రతినిధి భాస్కర్ మాట్లాడుతూ.. తాము ఉచిత దర్శనమనే చెప్పామని, ఎలాంటి ప్రత్యేక దర్శన టికెట్లు ఇస్తామని చెప్పలేదని పేర్కొన్నారు.

### ప్రభుత్వ స్థలంలో
# ప్రహరీ నిర్మాణంపై వివాదం



గ్రామకంఠ స్థలంలో నిర్మించిన ప్రహరీ

తిరుపతిరూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం కేసీపేట గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబరు 260లోని ప్రభుత్వ స్థలాన్ని (గ్రామకంఠం) ఆక్రమించి ప్రహరీ నిర్మించడం వివాదాస్పదంగా మారింది. ఈ స్థలానికి ఆనుకుని నివాసం ఉంటున్న స్థానిక ఓ మహిళ ప్రహరీని నిర్మించారని తెలిసింది. గ్రామానికి చెందిన స్థలంలో నిర్మాణాన్ని చేపట్టరాదని అడ్డుకున్నా లెక్కచేయకుండా ప్రహరీని నిర్మించారని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో ఈ స్థలంలో రావిచెట్టు, రచ్చబండ ఉండేవని, రావిచెట్టు పడిపోవడంతో రచ్చబండ శిథిలమైందని అంటున్నారు. ఇప్పటికీ అక్కడ నాగాలమ్మ విగ్రహం ఉందని, విలువైన ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా సత్వరమే తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై రూరల్ మండల రెవెన్యూ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సర్పంచి పిపాసి మాట్లాడుతూ.. గ్రామకంఠ భూమి అన్యాక్రాంతం కాకుండా, గ్రామస్తులందరితో చర్చించి గ్రామ అవసరాల కోసం వినియోగించుకునేలా చర్యలు చేపడుతామని చెప్పారు.

## తొండవాడ ఎన్టీఆర్ కాలనీలో చర్చి ఏర్పాటు

- ఇరువర్గాల మధ్య వివాదం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన స్థానికులు



పోలీస్ స్టేషన్‌కు వచ్చిన క్రైస్తవులు

చంద్రగిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, తొండవాడ సమీపంలోని ఎన్టీఆర్ కాలనీలో ఓ ఇంట్లో నూతనంగా చర్చిని ప్రారంభించడంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొనడంతో కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తొండవాడ సమీపంలో ఎన్టీఆర్ కాలనీలో శుక్రవారం ఓ ఇంట్లో చర్చిని ప్రారంభించి, మైక్ సెట్ సౌండ్ అధికంగా పెట్టారు. అక్కడే వీధిలో క్రైస్తవులు పదుల సంఖ్యలో వచ్చి ప్రార్థనలు చేశారు. దీంతో అక్కడున్న స్థానికులు ఆగ్రహించి ప్రభుత్వం ఇల్లులేని వారికి ఇంటి స్థలం ఇచ్చిందని, ఎలాంటి అనుమతులు లేకుండా ఆ ఇంట్లో చర్చిని ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో కాలనీవాసులకు, చర్చి నిర్వాహకులకు వివాదం చెలరేగింది. అనంతరం స్థానికులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువర్గాలను పిలిచి విచారిస్తున్నారు.

## పక్కాగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర

తిరుపతి(కలెక్టరేట్), మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు పటిష్ఠంగా అమలు చేయాలని, వేసవి నేపథ్యంలో చలివేంద్రాలు, చలువ పందిళ్లు, షేడ్‌నెట్ వంటివి ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వర్చువల్ విధానంలో ఆయన అధికారులతో సమీక్షించారు. వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాదచారులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వైట్ కూల్ పెయింట్, ప్రభుత్వ భవనాలపై రూఫ్ టాప్ గార్డెనింగ్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ జంక్షన్ల వద్ద షేడ్ నెట్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈ నెలలో బీట్ ద హీట్ క్యాంపెయిన్ ఉంటుందని, దీనిపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, డీపీవో సుశీలాదేవి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో ఇస్రో చైర్మన్



ధ్వజస్తంభం వద్ద ఇస్రో చైర్మన్ నారాయణన్ సహా కుటుంబీకులు


శ్రీకాళహస్తి, మే 16 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శుక్రవారం ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు

తిరుపతి (నేరవిభాగం), మే 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఓ మహిళ ఫిర్యాదుపై ఈస్ట్ పోలీసులు ఇద్దరిపై శుక్రవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నారాయణపురం 6వ క్రాస్ వద్ద ఝాన్సీ రాణి నివాసం ఉంటున్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట తన వద్ద తిరుపతికి చెందిన దుర్గాప్రసాద్, సంతోష్ రూ.8.6 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ రామాంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టెన్షన్.. టెన్షన్

- చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో యుద్ధ వాతావరణాన్ని తలపించేలా మాక్ డ్రిల్



డాగ్ స్క్వాడ్ తనిఖీలు..

చిత్తూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం ఎటుచూసినా టెన్షన్ వాతావరణం కనిపించింది. ఓవైపు గాయపడ్డవారు.. మరోవైపు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది.. సూట్ కేసు బాంబును నిర్వీర్యం చేయడం.. డాగ్ స్క్వాడ్ తనిఖీలు ఇలా అక్కడి వాతావరణం కనిపించింది. దీన్ని చూసిన ప్రయాణికులకు, స్థానికులకు ఏం జరిగిందో కొంతసేపు అర్థం కాలేదు. తర్వాత మాక్ డ్రిల్ అని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడుల నేపథ్యంలో చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం పోలీస్, ఫైర్, వైద్యశాఖ సంయుక్తంగా నిర్వహించిన మాక్‌డ్రిల్ యుద్ధ వాతావరణాన్ని తలపించింది. జనావాసాల్లో, బస్టాండ్‌లో ఉగ్రదాడి జరిగితే సమీపంలోని పౌరులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. బాధితులకు ఎలాంటి సాయం చేయాలో కళ్లకు కట్టినట్లు చూపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శివానంద కిషోర్, డీఎంహెచ్‌వో సుధారాణి, డిప్యూటీ కలెక్టర్ అనుపమ, ఆర్టీసీ శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# చంద్రగిరి

## ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఉప్పువంకలో ప్రత్యేక అవసరాలు కల పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

పాకాల, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహిత విద్య సమన్వయ కర్త చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మండలంలో సహిత ఉపాధ్యాయులు చేస్తున్న సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. నేండ్రగుంట, ఉప్పువంక, దేశిరెడ్డిపల్లె, ఇరంగారిపల్లె, గాంధీనగర్‌లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. పిల్లల ఎదుగుదల కోసం భవిత కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. భవిత కేంద్రంలో స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ, ఎంఆర్ ఇంటరాక్షన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలకు అవసరమైన ఉపకరణాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు మునికృష్ణారెడ్డి, సుందరి తదితరులు పాల్గొన్నారు.

● రామచంద్రాపురం (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రతిభావంతులను మిట్టూరు భవిత కేంద్రంలో చేర్పించాలని జిల్లా సహిత విద్య సమన్వయ కర్త చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మిట్టూరు ఎస్టీకాలనీలో ప్రత్యేక ప్రతిభావంతులను గుర్తించేందుకు సర్వే నిర్వహించారు. ప్రభుత్వం ప్రత్యేక ప్రతిభావంతులకు అన్ని మౌలిక వసతులను కల్పిస్తోందని ఆయన తెలిపారు. మనోహర్, రాజేశ్వరి పాల్గొన్నారు.

## ఆగివున్న లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం



ప్రసన్న మృతదేహం

చంద్రగిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, తొండవాడ-రాయలపురం మధ్యలోని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో ఆగివున్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... శుక్రవారం తమిళనాడు రాష్ట్రం, కాట్పాడికి చెందిన ప్రసన్న రేణిగుంట సమీపంలో ఓ ప్రైవేటు ఎలక్ట్రికల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తన తండ్రి నెల క్రితం చనిపోవడంతో ఆయనకు సంప్రదాయ కార్యక్రమాలు నెరవేర్చడానికి శుక్రవారం రేణిగుంట నుంచి కాట్పాడికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గమధ్యంలోని రాయలపురం సమీపంలో సర్వీసు రోడ్డులో రాహుల్ డాబా వద్ద ఆగివున్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ప్రసన్న తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఏకగ్రీవంగా టీడీపీ గ్రామ కమిటీలు

పాకాల, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుగారిపల్లె, దామలచెరువు, గాదంకి, ఉప్పరపల్లె పంచాయతీలలో తెలుగు దేశం పార్టీ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజ నాయుడు, ప్రధాన కార్యదర్శి ఫల్గుణకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికలు జరిగాయి. పార్టీ పరిశీలకులు రమేష్‌రెడ్డి, సింధుసుధ, ధనుంజయరెడ్డిల పర్యవేక్షణలో గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. చెన్నుగారిపల్లె గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పవన్‌కుమార్ (గోపి), ప్రధానకార్యదర్శిగా పి.లోకేష్, దామలచెరువు అధ్యక్షుడిగా మేడసాని నాగరాజ నాయుడు, ప్రధానకార్యదర్శిగా డి.నవీన్‌కుమార్ యాదవ్, గాదంకి అధ్యక్షుడిగా ఎస్.రవీ, ప్రధానకార్యదర్శిగా జి.గురుప్రసాద్, ఉప్పరపల్లె అధ్యక్షుడిగా ఎస్.ప్రసాద్‌రావ్ (బుజ్జి), ప్రధానకార్యదర్శిగా రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## బాలుడి అదృశ్యం

తిరుపతి (నేరవిభాగం), మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం సాయినగర్‌కు చెందిన రావుల సాయి (10) తప్పిపోయాడని రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ప్రవీణ్, అంజనమ్మ దంపతుల కుమారుడైన సాయి శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి కనపడలేదని వారు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఒకసారి ఈ బాలుడు తప్పిపోగా.. చెన్నైలో గుర్తించారు. ప్రస్తుతం ఇతడి ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని రూరల్ సీఐ చిన్నగోవిందు కోరారు.

# అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయండి

- కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని



అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులను ఆదేశించారు. శుక్రవారం చంద్రగిరిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అన్నిశాఖల అధికారుల నుంచి కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారని, అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యంవహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా వేగంగా పూర్తిచేయాలని అధికారులను కోరారు. ప్రధానంగా తొండవాడ స్వర్ణముఖి వంతెన వరదలకు నీటిలో మునిగిపోవడం వల్ల ప్రధాన రహదారి మూసుకుపోతుందని చెప్పారు. పూతలపట్టు - నాయుడుపేట జాతీయరహదారిలో చంద్రగిరి, పాకాల మండలాల్లో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, చంద్రగిరి, పాకాల మధ్యలో, ఎ.రంగంపేట, దామలచెరువులో మొత్తం మూడు 108 అంబులెన్స్‌లు మంజూరు చేయాలన్నారు. ఐతేపల్లి వద్ద వంతెన మంజూరు చేయాలని కోరారు. స్వర్ణముఖి నదిపై తనపల్లి, చిగురువాడ, తిరుచానూరు వద్ద నూతన వంతెనలు మంజూరు చేయాలన్నారు. ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు నివసిస్తున్నాయని, వారికి సొంత ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే విన్నవించారు. సమావేశంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, ఉమ్మడి జిల్లా జడ్పీ సీఈవో రవికుమార్, పీడీ శ్రీనివాస్‌ప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యం నాయుడు, డీఎస్పీ ప్రసాద్, అన్నిశాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల పరిశీలన

చంద్రగిరిలో జరుగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నానిలు శుక్రవారం పరిశీలించారు. నూతన ఎంపీడీవో కార్యాలయ భవన నిర్మాణం, స్వర్ణముఖినది ఒడ్డున గోవింద ధామం పనులను కలెక్టర్, ఎమ్మెల్యేలు అధికారులతో కలిసి పరిశీలించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని కూడా పరిశీలించారు. ఈ భవన నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ శివరామసుబ్బయ్య, అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి పోలీసుల అదుపులో 14 మంది పాత నేరస్తులు

- వివిధ కోణాల్లో దర్యాప్తు

తిరుపతి(నేరవిభాగం), మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పోలీసులు శుక్రవారం 14 మంది పాత నేరస్తులను అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల టీటీడీ వసతి సముదాయాల్లో ఉంటున్న భక్తుల నుంచి దొంగలు బంగారు నగలు, మొబైల్ ఫోన్లు, నగదు, ఇతర వస్తువులు అపహరిస్తున్న విషయం విదితమే. వీటిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురితమవడంతో ఎస్పీ హర్షవర్ధన రాజు సెల్ కాన్ఫరెన్సులో సంబంధిత అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. టీటీడీ వసతి సముదాయాల్లో దొంగతనాలు పెరిగి పోయి భక్తుల్లో ఆందోళన కలుగుతుంటే పోలీసు, టీటీడీ విజిలెన్సు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ గిరిధర్, సిబ్బంది కలిసి రెండు రోజులుగా అక్కడ భద్రత పెంచారు. నిఘా ఉంచడంతో కొంత మంది పాత నేరస్తులు, అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు మొబైల్ దొంగలు, చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న వారు, నగదు కొట్టేస్తున్న వారిని దాదాపు 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. టీటీడీ వసతి సముదాయాలను అడ్డాగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వారిని విచారిస్తున్నారు. వీరిలో చాలా మంది పాత నేరస్థులు వున్నారు. వీరందరి నుంచి గతంలో వేలి ముద్రలు సేకరించిన పోలీసులు ప్రస్తుతం మళ్ళీ వేలి ముద్రలు తీసుకుని సరి చూస్తున్నారు. దీంతో టీటీడీ వసతి సముదాయాల వద్ద చోరీలు తగ్గే అవకాశం వుంది.

### గరుడ వారధి మరమ్మతులతో
# ట్రాఫిక్ కష్టాలు



తిరుపతి(నేరవిభాగం), మే 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గరుడ వారధి ఫ్లైఓవర్ పనుల్లో నాణ్యత లోపించడంతో కొన్ని రోజులకే రోడ్లు, డివైడర్లు దెబ్బతిన్నాయి. మూడు రోజుల క్రితం ఆర్టీసీ బస్టాండు నుంచి అలిపిరికి వెళ్లే మార్గంలో డివైడర్ దెబ్బతింది. తిరుపతి కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలను బంద్ చేశారు. ఈ క్రమంలో హీరోహోండా షోరూం, కాటన్ మిల్లు రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఇరుకు రహదారిలో బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ కారణంగా గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. శుక్రవారం సాయంత్రం హీరోహోండా షోరూం వద్ద ట్రాఫిక్ స్తంభించడంతో రెండు గంటల పాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొందరు ట్రాఫిక్ కష్టాలను ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

# వైద్య సేవల్లో అలసత్వం వద్దు

- రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



కల్లూరులోని ఓ దుకాణంలో టీ తాగుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడి

కల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సకాలంలో ప్రభుత్వ వైద్యసేవలు అందించాలని, వైద్యసేవల్లో ఎలాంటి అలసత్వం వద్దని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు. పులిచెర్ల మండలం కల్లూరు ప్రభుత్వాస్పత్రిని శుక్రవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆస్పత్రిలో ఓపీ వివరాలు, మందులు, ల్యాబ్‌లో నిర్వహించే పరీక్షలు, 108, 104 వైద్య సేవలు, వైద్య సిబ్బంది, ఆసుపత్రి సౌకర్యాలపై డాక్టర్ జానకీరావును అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సమయాల్లో అందించే వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో ఎలాంటి సమస్యలున్నా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**● సాధారణ వ్యక్తిగా టీ స్టాల్లో...**

కల్లూరు ప్రభుత్వాస్పత్రి తనిఖీ కోసం చల్లా రామచంద్రారెడ్డితో కలిసి కల్లూరు నాలుగురోడ్ల కూడలికి చేరుకున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఓ టీ స్టాల్ వద్ద కారును ఆపి టీ తాగారు. అక్కడ ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### జూలైకి హంద్రీ-నీవా
# పనుల పూర్తి

- కుప్పానికి తాగు, సాగు నీరిస్తాం
- మంత్రి నిమ్మల రామానాయుడు



దాసార్లపల్లె వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ పనులను పరిశీలిస్తున్న మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

వి.కోట/కుప్పం/శాంతిపురం,మే 16(ఆంధ్రజ్యోతి):జూలై నాటికి హంద్రీ -నీవా సుజల స్రవంతి కాల్వ పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. వి.కోట మండలం దాసార్లపల్లె వద్ద జరుగుతున్న హెచ్ఎన్ఎస్ఎస్ రెండవ దశ కెనాల్ లైనింగ్ పనులను శుక్రవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో కలసి మంత్రి పరిశీలించారు.లైనింగ్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సినిమా సెట్టింగుల తరహాలో ట్యాంకర్లలో నీరు పారించి కుప్పానికి నీరిచ్చామని ప్రజలను మభ్యపెట్టిందని ఎద్దేవా చేశారు. ఐదేళ్ళు తట్ట మట్టినా వేయకుండా, అరబస్తా సిమెంట్ పనులు చేయకుండా రూ.వందల కోట్లు దిగమింగారని ఆరోపించారు. హంద్రీ-నీవా పూర్తి చేశామని రాయలసీమ రైతులను మాటలతో మభ్యపెట్టారన్నారు.వెలుగోడు ప్రాజెక్టు పనులు పూర్తి చేశామంటూ జాతికి అంకితం చేశారని తీరా రూ. 5 వేల కోట్లు వెచ్చించి మరో మూడేళ్ళు కష్టపడ్డా పనులు పూర్తికాని పరిస్థితి నెలకొందన్నారు. పూర్తికాని పనులను తామే పూర్తిచేసినట్లు చెప్పుకున్న జగన్ చివరకు రాయలసీమ ద్రోహిగా నిలిచాడన్నారు. గత ప్రభుత్వంలో పెద్ద మంత్రిగా చెలామణి అయిన వ్యక్తి మట్టిదోచుకోవడంపై పెట్టిన శ్రద్ధ పుంగనూరు బ్రాంచ్ కెనాల్ పూర్తి చేయడంపై పెట్టలేదన్నారు.విజిలెన్స్ విచారణ జరుగుతోందని, ఆయన దోచుకున్న అవినీతి సొమ్ము పూర్తిగా కక్కిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.వందల కోట్ల నిధులు వెచ్చించి కుప్పం బ్రాంచ్ కెనాల్ పనుల పురోగతిపై 15 రోజులకోసారి సమీక్షిస్తూ త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తునారన్నారు. జూలై నాటికి పనులు పూర్తి చేసి కుప్పానికి తాగు, సాగు నీరిస్తామన్నారు.

### జలవనరుల అధికారులతో సమీక్ష

వి.కోట పర్యటనకు ముందు మంత్రి రామానాయుడు శాంతిపురం సమీపంలోని పాలారు నదిపై నిర్మించిన కల్వర్టులను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీక్రాంత్, కడా పీవో వికాస్ మర్మత్‌తో కలసి పరిశీలించారు. హంద్రీ -నీవా కుప్పం బ్రాంచ్ కాల్వ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు.ఈ కాల్వకు సంబంధించి మట్టి పనులు పూర్తయ్యాయని, కాంక్రీట్ లైనింగ్ పనులు వివిధ దశల్లో ఉన్నట్లు ఈఎన్సీ వెంకటేశ్వరావు, ఎస్ఈ విఠల్ ప్రసాద్ మంత్రికి వివరించారు.ఆర్టీసీ వైస్ చైర్మన్ వీ.ఎస్.మునిరత్నం, టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారాం, ఆర్డీవోలు శ్రీనివాసులు, భవాని, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు, టీడీపీ నేతలు రంగనాథ్, రాంబాబు, సుబ్బన్న, శబరీష్, రవిచంద్రబాబు, డా.సురేష్‌బాబు, విశ్వనాథనాయుడు, విజయ్‌రామిరెడ్డి, సుగుణమ్మ,చంద్రశేఖర్, సుబ్రమణ్యం తదితరులతో పాటు జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.



శాంతిపురం వద్ద పనుల పురోగతిని తెలుసుకుంటున్న మంత్రి

# స్వర్ణరథంపై వరసిద్ధుడి విహారం

ఐరాల(కాణిపాకం), మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో శుక్రవారం రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి స్వర్ణరథంపై విహరించారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేశారు. ఉత్సవర్లను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై కొలువుదీర్చారు. ఎదురుగా భక్తులను కూర్చోబెట్టి సంకటహర గణపతి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, రవి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



స్వర్ణరథాన్ని లాగుతున్న ఈవో తదితరులు







శ్రీనివాస క్రీడా ప్రాంగణంలో పేరుకున్న వ్యర్థాలు, చెత్త

# అపరిశుభ్రం..ఆటల ప్రాంగణం

## శ్రీనివాస క్రీడా సముదాయంలో పేరుకున్న వ్యర్థాలు





తిరుపతి(క్రీడలు), మే 16(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. కొన్ని రోజులుగా వ్యర్థాలు, చెత్తను తరలించకపోవడంతో గుట్టగుట్టలుగా పేరుకుంది. వీటి మధ్యనే క్రీడాకారులు ఆటలు ఆడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. శ్రీనివాస క్రీడా సముదాయంలోని కార్యాలయం, వివిధ క్రీడాంశాల వేదికల ముందు మాత్రమే ప్రతిరోజూ శుభ్రం చేస్తున్నారు. వెనుకభాగంలో పాడైన క్రీడా, విద్యుత్ సామగ్రి, విరిగిన చెట్లకొమ్మలు, రాలిన ఆకులు, పాడైన మరుగుదొడ్లు, బ్యానర్లు, కటౌట్లు, తుప్పు పట్టిన విద్యుత్ జంక్షన్ బాక్సులు, కూలిన గార్డెన్ లైట్లు, పగిలిన కుండీలు, ఇనుప పైపులు, పాతసైకిల్, బారికేడ్లు, ప్లాస్టిక్ కుర్చీలు, వాహనాల టైర్లతో నిండిపోయి కళావిహీనంగా తయారైంది. ప్రస్తుత ఎండలకు నిప్పంటుకుంటే భారీ అగ్నిప్రమాదం సంభవించే ప్రమాదముంది. అయినా అధికారులు, సిబ్బంది, కోచ్‌లు దీనిపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. శాప్ చైర్మన్ రవినాయుడు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరముంది.

# డెంగ్యూపై అవగాహన అవసరం



ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యులు

తిరుపతి అర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): డెంగ్యూపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జయంతి పేర్కొన్నారు. డెంగ్యూ డేను పురస్కరించుకుని శుక్రవారం జాతీయ కీటకజనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. జయంతి ఆధ్వర్యంలో వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో మురళి, పీహెచ్ఎన్ బాబీరాణి, రామలక్ష్మమ్మ, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

# పట్టుదలతో శ్రమిస్తే విజయం సాధ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రెడ్డి

తిరుపతిరూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో శ్రమిస్తే గొప్ప విజయాలు సాధించవచ్చని రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ (రిమ్స్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. బైరాగిపట్టెడలోని కళాశాలలో ఎంబీఏ సీనియర్ విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనకు ప్రణాళికలు ఆచరించాలన్నారు. సమయపాలన అలవర్చుకోవాలని, సెల్‌ఫోన్లను అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చైర్మన్ వై.కొండారెడ్డి, డైరెక్టర్లు వై.ఆనందరెడ్డి, వై.విజయ్‌రెడ్డి, ఎంబీఏ, ఎంసీఏ హెడ్లు డాక్టర్ పి.నిరంజన్‌రెడ్డి, పి.మధుర పాల్గొన్నారు.

# బ్రెయిలీ లిపి పుస్తకాల పంపిణీ



తిరుచానూరు, మే 16(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు సమీపంలోని నవజీవన్ బ్లైండ్ రిలీఫ్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు శుక్రవారం యోగిమల్లవరం యూనియన్ బ్యాంకు వారు బ్రెయిలీ లిపి పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో నవజీవన్ వ్యవస్థాపకులు శ్రీధర్ ఆచార్య, సీఎం విశ్వనాథరెడ్డి, బ్యాంకు మేనేజరు ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

# దోమల నియంత్రణతో డెంగ్యూ నివారణ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), మే 16(ఆంధ్రజ్యోతి): దోమలను నియంత్రించడం ద్వారా డెంగ్యూను నివారించవచ్చునని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా వివేకానంద సర్కిల్ నుంచి వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డెంగ్యూ అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డెంగ్యూను పూర్తిగా నివారించేందుకు 2010 మే 16 నుంచి ఏటా జాతీయ డెంగ్యూ దినోత్సవం నిర్వహిస్తున్నా మన్నారు. ఐదు నెలల వ్యవధిలో జిల్లాలో 59 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని, నివారణకు తగు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మరింత అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. చిన్నపాటి జ్వరం వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌టీవో శ్రీనివాసులురెడ్డి, మలేరియా అధికారి రూప్‌కుమార్, డీపీఎంవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

# యువకుడి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), మే 16(ఆంధ్రజ్యోతి): క్యాటరింగ్ దుకాణంలో పనిచేస్తున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం స్థానిక సత్యానారాయణపురంలో చోటు చేసుకుంది. అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా విడవలూరుకు చెందిన వివేక్ తిరుపతికి వలస వచ్చి క్యాటరింగ్ దుకాణంలో పనిచేస్తున్నాడు. సత్యానారాయణపురంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. తనతో పాటు పనిచేస్తున్న వారితో కొన్ని రోజులుగా చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. మనస్తాపానికి గురై విషం తాగాడు. స్నేహితులు గమనించి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## డీఈవో, సెక్యూరిటీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి రూరల్, మే16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బైరాగిపట్టెడలోని మాస్ సంస్థ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగాలకు 10వ తరగతి ఆపై విద్యార్హతతోపాటు ఫిజికల్ ఫిట్‌నెస్‌కి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. డీఈవో ఉద్యోగాలకు డిగ్రీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి విద్యార్హత ఉన్న వారు ఈనెల 19వ తేదీలోపు బైరాగిపట్టెడలో పద్మావతిపార్క్ వెనుక ఉన్న మాస్ సంస్థల్లో నేరుగా సంప్రదించాలని కోరారు. వివరాల కోసం 9392275861ను సంప్రదించాలని కోరారు.

# 'విశ్వహిందూ పరిషత్ విస్తరించాలి'



సంజయ్‌దావళికర్‌ను సన్మానిస్తున్న నరసింహులు

తిరుపతి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ అన్ని రంగాల్లోకి విస్తరించాలని వీహెచ్‌పీ అఖిల భారత స్థాయి అధికారి సంజయ్‌దావళికర్ అన్నారు. స్థానిక వరదరాజనగర్‌లోని శ్రీబాలాజీ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ హాల్లో శుక్రవారం విశ్వహిందూ పరిషత్-విశేష సంపర్క్ విభాగం ఆధ్వర్యంలో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజంలోని వ్యవస్థలు, ప్రముఖులు హిందుత్వాన్ని అర్థం చేసుకుని, హిందూ సమాజ సంఘటనకు కృషి చేయాలని కోరారు. విశేష సంపర్క్ విభాగం హిందూ సమాజంపై జరుగుతున్న దాడులను సమాజంలోని ప్రముఖ వ్యక్తుల ముందుంచి, వాటి పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పి.కోటేశ్వరరావు, సంపర్క విభాగం రాష్ట్ర ప్రముఖ్ ప్రతాప్‌రెడ్డి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ పి.సందీప్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌బాబు, జిల్లా ప్రముఖ్ దిండుకుర్తి నరసింహులు, కార్యదర్శి భరణీకృష్ణ, ఉపాధ్యక్షులు వసుంధర, విష్ణు, కిరీటి పాల్గొన్నారు.

# మూడంచెల పాఠశాల వ్యవస్థ ప్రవేశపెట్టాలి



పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న ఆపస్ నాయకులు

తిరుపతి(విద్య), మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడంచెల పాఠశాల వ్యవస్థను ప్రవేశపెట్టాలని ఆపస్ నాయకులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ప్రధాన కార్యదర్శి మధుకర్‌లను కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు విజయవాడలో వారిని కలిసి పాఠశాల విద్యాశాఖలో నెలకొన్న సమస్యలు, ఇబ్బందుల గురించి తెలియజేశారు. ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ, కార్యదర్శి సీహెచ్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలల్లో తెలుగు మీడియాన్ని కొనసాగించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45 దాటితే రెండో సెక్షన్ ఏర్పాటు చేయాలని, ప్రతి 30 మంది అదనపు విద్యార్థులకు ఓ సెక్షన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్జీటీలకు పదోన్నతి కల్పించాలని, హైస్కూల్ ప్లస్‌లను కొనసాగిస్తూ ఖాళీగా ఉన్న పీజీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

# ఈసెట్‌లో సాయిమేధ విద్యార్థుల ప్రతిభ



ఎం.దివాకర్, పి.రాజశ్రీ, ఎం.వినయ్

తిరుపతి(విద్య), మే 16 (ఆంధ్రజ్యోతి): ఈసెట్-2025 ఫలితాల్లో తిరుపతికి చెందిన సాయిమేధ విద్యాసంస్థ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని చైర్మన్ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివాకర్ (ఈఈఈ) 2వ ర్యాంకు, పల్లేటి రాజశ్రీ (సీఎస్ఈ) 5వ ర్యాంకు, మద్దూరి వినయ్(ఈఈఈ) 5వ ర్యాంకు, తిరగటి బాలవెంకట సురేష్(డీఎంఈ) 5వ ర్యాంకు, కిజారపు ప్రతాప్ (ఈసీఈ) 6వ ర్యాంకు పొందారని వెల్లడించారు. పొలమరశెట్టి పవన్‌స్వామి(ఈఈఈ) 7వ ర్యాంకు, చిర్రి కార్తీక్ (ఈఈఈ) 8వ ర్యాంకు, గురువు బాలకృష్ణ (డీఎంఈ) 10వ ర్యాంకు మందాటి ప్రత్యూష (డీఎంఈ) 11వ ర్యాంకు, ఆర్.తరుణ్ (డీఎంఈ) 13వ ర్యాంకు, బి.యువతేజ (డీఎంఈ) 14వ ర్యాంకు, వెంకట నరసింహమూర్తి (డీఎంఈ) 17వ ర్యాంకు, కె.సత్యచంద్ర (ఈఈఈ) 19వ ర్యాంకు, కొరిపల్లి వంశీ (ఈఈఈ) 20వ ర్యాంకు, కృష్ణసత్య (సీఎస్ఈ) 24వ ర్యాంకు, కీర్తన (ఈఎస్ఈ) 25, లోకేష్ (సీఎస్ఈ) 28వ ర్యాంకు సాధించారని తెలిపారు. విద్యార్థులను ఆయన అభినందించారు.

# ఈసెట్‌లో ఎస్వీ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు



ఎ.కీర్తి, వీవీఎస్ఎస్ తరుణ్, ఎస్.సుప్రజ, జి.జయచంద్రారెడ్డి, ఎం.రేష్మ, కె.సాయిశ్రుతి, ఎం.ప్రత్యూష, ఎ.శ్రీవెంకట్, కె.రఘు, వై.రాజశేఖర్

తిరుపతి(విద్య), మే 16 (ఆంధ్రజ్యోతి): డిప్లొమా ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు బీటెక్‌లో చేరేందుకు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈసెట్-2025లో తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఫార్మసీ విద్యార్థిని ఎ.కీర్తి 200 మార్కులకు గాను 130 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు పొందిందని వెల్లడించారు. వీవీఎస్ఎస్ తరుణ్ 106 మార్కులతో 6వ ర్యాంకు, ఎస్ సుప్రజ 108 మార్కులతో 7వ ర్యాంకు పొందారని వివరించారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో జి.జయచంద్రారెడ్డి 10వ ర్యాంకు, ఎం. రేష్మ 20వ ర్యాంకు, కె.సాయి శ్రుతి 30వ ర్యాంకు సాధించారని తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎం.ప్రత్యూష 11వ ర్యాంకు, సివిల్ ఇంజినీరింగ్‌లో ఎ.శ్రీవెంకట్ 4వ ర్యాంకు, కె.రఘు 6వ ర్యాంకు, వై.రాజశేఖర్ 13వ ర్యాంకు సాధించారన్నారు. వీరిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

# అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

తిరుపతి(ఆటోనగర్), మే 16 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ కోరారు. వేమన విజ్ఞాన కేంద్రంలో అంగన్‌వాడీల రాష్ట్ర తరగతులను ఆమె శుక్రవారం ప్రారంభించి మాట్లాడుతూ వేతనాల పెంపుకోసం గత ఏడాది 42 రోజులు సమ్మె చేసినా వైసీపీ ప్రభుత్వం సహకరించలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా వేతనాల పెంపుపై ఇప్పటివరకు జీవో విడుదల చేయకపోవడం సరికాదన్నారు. జూలై 9వ తేదీలోపు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, యూనియన్ నేతలు లక్ష్మీదేవమ్మ, రాజేశ్వరి, ఇంద్రాణి, హైమావతి, సౌజన్య, రేవతి, నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), మే 16(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏపీఎస్పీడీసీఎల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యూఇందిరానగర్, ఎస్‌జీఎస్ కాలేజీ రోడ్డు, ఎస్టీవీ నగర్, గీతానగర్, ఎస్వీబీ కాలనీ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

# విగ్రహ ఏర్పాటు నిర్ణయం హర్షణీయం




మాట్లాడుతున్న కురబ సంఘ నేతలు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), మే 16(ఆంధ్రజ్యోతి): నగరంలో భక్త కనకదాసు విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని జిల్లా కురబ, కురమ, కురవ సంఘ నాయకులు అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా తిరుపతి నగరంలో భక్త కనకదాసు విగ్రహం నెలకొల్పాలన్న కోరిక త్వరలో నెరవేరనుందన్నారు. ఇందుకు సహకరించిన మంత్రి సవిత, స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, నగర పాలక కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మంగిరి రెడ్డెప్ప, రెడ్డికుమార్, నాగేశ్వరరావు, వెంకటప్ప, మల్లి, నాగసుబ్బయ్య, రెడ్డి శేఖరన్, మోహన తదితరులు పాల్గొన్నారు.

## జీవకోనలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు

తిరుపతి(నేరవిభాగం), మే 16 (ఆంధ్రజ్యోతి): జీవకోనను పోలీసులు నిఘా నీడలోకి తీసుకోనున్నారు. ఆకతాయిలు, గంజాయి బ్యాచ్‌లు, రౌడీలు, మందుబాబులకు అడ్డాగా తయారైన ఈ ప్రాంతంలో 120 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. తిరుపతిలోనే అత్యధికంగా నేరాలు జరిగే ప్రాంతంగా ఉండడంతో కట్టడికి చర్యలు తీసుకుంటున్నారు. రానున్న రెండు రోజుల్లో జీవకోన ప్రాంతంలోని అన్ని ప్రధాన వీధులు, సందులు, సర్కిళ్లు, తిరుపతి నుంచి జీవకోనకు వెళ్లే మార్గం వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

# విద్యార్థుల కిడ్నాప్.. దాడి

తిరుపతి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను కిడ్నాప్ చేసి, దాడికి పాల్పడిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. తిరుచానూరు ఎస్ఐ అరుణ వివరాల మేరకు.. కరకంబాడి రోడ్డులోని ఒక ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్న శ్యామల్, సాయిరెడ్డి, జేమ్స్ శుక్రవారం కళాశాల బయట ఉన్న హాస్టల్ వద్ద మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో మరో కళాశాలకు చెందిన యశ్వంత్‌తో పాటు మరికొందరు కలిసి సాయిరెడ్డి, జేమ్స్‌ను కారులో బలవంతంగా ఎక్కించుకుని శ్రీనివాసపురం పంచాయతీలోని ఒక హోటల్లో నిర్బంధించి, దాడికి పాల్పడ్డారు. అనంతరం విడిచిపెట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు యశ్వంత్, లలిత్, గౌడ్ మరికొందరిపై పోలీసులు కిడ్నాప్‌తో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# హనుమంత, గజవాహనాలపై వెంకన్న విహారం



హనుమంత, గజ వాహన సేవలు





నారాయణవనం, మే 16(ఆంధ్రజ్యోతి): పద్మావతి సమేత కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం హనుమంతు వాహనంపై, రాత్రి గజ వాహనంపై శ్రీవారు విహరించి భక్తులపై వరాల జల్లు కురిపించారు. ఉదయం 4గంటలకు సుప్రభాతసేవలో మేల్కొలిపి స్వామికి నిత్య పూజా కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. నిత్య శుద్ధి, తోమాల, అర్చన, గంట, నైవేద్యం తదితర సేవలను పూర్తి చేశారు. అనంతరం స్వామివారిని హనుమంత వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. తదనంతరం స్వామివారిని సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న కు వసంతోత్సవాన్ని నిర్వహించి, పుర వీధుల్లో ఊరేగించారు. రాత్రి స్వామివారు గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరిటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్‌భట్టాచార్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజి వినాయక స్వామి ఆలయం వద్ద సంకటహర చతుర్థి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి కుటుంబం గణపతి హోమం నిర్వహించుకునే విధంగా ఆలయ అధికారులు సంకట చతుర్థి హోమాన్ని ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఇందులో భాగంగా శుక్రవారం అంజంజి గణపతి ఆలయం లో పూజలు చేశారు. కలశ స్థాపన అనంతరం గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## మామిడి రైతులను ఆదుకుంటాం

● గిట్టుబాటు ధరపై కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 16(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన మామిడి పరిశ్రమ యాజమాన్యం, రైతు సంఘ నాయకులు, వ్యాపారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నెలవారీగా వచ్చే మామిడి దిగుబడిని పరిశీలించి మద్దతు ధరకు చర్యలు తీసుకోవాలని ప్రాసెసింగ్ పరిశ్రమల ప్రతినిధులను కోరారు. కాయలు పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాత కోయడం వల్ల మార్కెట్‌లో లాభాలు పొందవచ్చునని రైతులకు సూచించారు. అటు రైతులు, ఇటు ఫ్యాక్టరీ యజమానులు నష్టపోకుండా స్థిరత్వం కలిగిన ధరలు నిర్ణయించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. పక్క రాష్ట్రాల నుంచి మామిడి పండ్లను దిగుమతి చేసుకోవడం వల్ల తాము నష్టపోతున్నామని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. మరోసారి ఉమ్మడి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి రైతులు, రైతు సంఘ నాయకులు, ఫ్యాక్టరీ యజమానులతో సమావేశమై చర్చిస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రేపు అండర్ 19, 23 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి(క్రీడలు), మే 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) ఆధ్వర్యంలో ఆదివారం అండర్ 19, 23 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు కరకంబాడి రోడ్డులోని కజారియా టైల్స్ ఎదురుగా వున్న సీవీ క్రికెట్ అకాడమీలో హాజరుకావాలని పేర్కొన్నారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామగ్రితో రావాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 9000214966, 8886185559లను సంప్రదించాలని కోరారు.


## సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 7 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**బుధవారం హుండీ ఆదాయం: రూ.3.72 కోట్లు**

**గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,208**

**తలనీలాలు సమర్పించినవారు: 32,951**





● జిల్లాలో 1.25లక్షల మంది రక్తపోటు బాధితులు

● అనధికారికంగా మరో రెండు లక్షలు పైనే






(నేడు ప్రపంచ బీపీ డే)

# బీపీ లేస్తోంది..!

ఆరోగ్యంలో అతి ముఖ్యమైన సమస్యగా బీపీ మారిపోయింది. ఒకప్పుడు వృద్ధాప్యంలో మాత్రమే బీపీ సమస్య మొదలయ్యేది. ఇప్పుడు వయసుతో నిమిత్తం లేదు. ముఖ్యంగా యువత అధిక రక్తపోటుకు గురవడమే ఆందోళన పెడుతోంది. జీవనశైలిలో వచ్చిన మార్పులే ఇందుకు ప్రధాన కారణమని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.ప తిరుపతి జిల్లాలో 1,24,607 మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని వైద్య వర్గాల గణాంకాల్లో నమోదైంది. నిజానికి బీపీ చెక్ చేసుకోనివారే అత్యధికంగా ఉంటారు. ఇలా చేస్తే ఈ సంఖ్య భయపెట్టేంత ఉండచ్చని అంచనా. అయితే నియంత్రణలో ఉంచుకుంటే బీపీకి జంకాల్సిన అవసరమే ఉండదు. రక్తపోటు నుంచి ఎలా తప్పించుకోవాలో, ఒకవేళ వస్తే ఎలా అధిగమించాలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, హార్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ అభిషేక్ కాషా 'ఆంధ్రజ్యోతి'కి ఇలా వివరించారు.

– తిరుపతి, ఆంధ్రజ్యోతి

### 140/90 మించితే..

సాధారణ రక్తపోటు 120/80 ఉంటుంది. ఇది నిరంతరం 140/90 మించి ఉంటేనే బీపీ ఉన్నట్టుగా భావించాలి. ఎప్పుడో ఒకసారి ఇలా కనిపిస్తే ఆందోళన అవసరం లేదు. ఒత్తిడి, శారీరక శ్రమ వంటి తాత్కాలిక కారణాల వలన హఠాత్తుగా అధిక రీడింగ్ రావచ్చు. అప్రతిరోజు సాధారణం కంటే ఎక్కువ చూపిస్తేనే అధిక రక్తపోటుగా నిర్ధారించుకోవాలి. గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్ వంటి వాటికి అధిక రక్తపోటు దారితీసే అవకాశం ఉంటుంది.

డాక్టర్ అభిషేక్ కాషా, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, హార్ట్ స్పెషలిస్ట్, తిరుపతి.

**ఇంట్లోనే చెక్ చేసుకోవచ్చు**

బీపీ ఎంత ఉందో తెలుసుకుంటూ ఉండడం ముఖ్యం. ఇందుకోసం ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం కూడా లేదు. చిన్న పరికరం ఇంట్లో ఉంచుకుంటే చాలు. ఇంట్లో పెద్దవాళ్లు ఉంటే తప్పనిసరిగా బీపీ చెక్ చేసుకుంటూ ఉండాలి.

**యువత సతమతం**

ఇటీవల యువతలో కూడా అధిక రక్తపోటు ఎక్కువగా కనిపిస్తుంది. ఇది జీవనశైలిలో వచ్చే మార్పులు, ఒత్తిడి, నిద్రలేమి వల్ల జరుగుతోంది. ఈ వయస్సులో రెండవ కారణాల్ని తప్పక పరిశీలించాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చాలామందికి బీపీ శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో లేదా ముందస్తు హెచ్చరిక సంకేతాలను ఎలా గుర్తించాలో పూర్తిగా తెలియదు. ఈ అవగాహన లేకపోవడం వల్ల బీపీని నియంత్రణలో పెట్టలేకపోతున్నారు. బీపీ నియంత్రణకు మెరుగైన మందులు అందుబాటులోకి వచ్చాయి. జీవనశైలి మార్పులు తోడైతే ఫలితాలు మరింత మెరుగవుతాయి.

### వేసవిలో ఇలా చేయండి..



బరువు నియంత్రణలో ఉంచుకోవాలి. తక్కువ ఉప్పు, తక్కువ కొవ్వు ఉన్న పదార్థాలే తీసుకోవాలి. మద్యం ఎక్కువైతే ప్రమాదమే. వ్యాయామం, ధ్యానం చాలా మంచి ఫలితాలను ఇస్తుంది. రక్తపోటును నివారించగల లేదా నియంత్రించగల ఆహారపు అలవాట్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ముఖ్యం. వేసవిలో లభించే పండ్లు కూరగాయల్లో ఏవి బీపీ నియంత్రణకు సహకరిస్తాయో స్విమ్స్ డైటీషియన్ డాక్టర్ కందారపు గీత ఇలా వివరిస్తున్నారు...

డాక్టర్ కందారపు గీత, డైటీషియన్, స్విమ్స్



**పుచ్చకాయ:** ఇది చాలా హైడ్రేటింగ్‌గా ఉంటుంది. ఇందులో ఎల్-సిట్రులైన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడంలోనూ, రక్తపోటును తగ్గించడంలోనూ సహాయపడుతుంది. ధమనుల పనితీరుకు మెరుగుపరుస్తుంది. దీనిలోని పొటాషియం కంటెంట్ శరీరంలో సోడియం ప్రభావాలను సమతుల్యం చేయడానికి కూడా సహాయపడుతుంది.



**దోసకాయ:** వేసవిలో రక్తపోటును నియంత్రించడంలో అద్భుతమైనది. కేలరీలు తక్కువగా ఉంటాయి. పొటాషియం అధికంగా ఉంటుంది, ఇది రక్త నాళాలను సడలించడానికి, మూత్రం ద్వారా అదనపు సోడియంను విసర్జించడానికి సహాయపడుతుంది.



**ఆకుకూరలు:** వేసవిలో దొరికే చాలా రకాలైన ఆకుకూరల్లో నైట్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి, రక్త నాళాలను వెడల్పు చేసి, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.



**కొబ్బరి నీళ్లు:** వీటిలో పొటాషియం, మెగ్నీషియం, ఎలక్ట్రొలైట్లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి ద్రవ సమతుల్యతను నియంత్రించడంలో రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి.



**మామిడి పండ్లు:** ఫైబర్, పొటాషియం, బీటా-కెరోటిన్ కూడా పుష్కలంగా ఉంటాయి, ఇవి అధిక రక్తపోటును నిర్వహించడంలో సహాయపడతాయి.



**నిమ్మకాయ:** విటమిన్ సి ఫ్లేవనాయిడ్లు బీపీ నియంత్రణకి ఎంతో ఉపయోగం.

# వ్యాపారిని బురిడీ కొట్టించి...

● ఫోన్‌పే ద్వారా రూ.81వేల లూటీ ● పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): చిల్లర దుకాణం వ్యాపారిని బురిడీ కొట్టించిన ఇద్దరు టక్కరి దొంగలు రూ.81వేలను స్వాహా చేశారు. బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఈ సరికొత్త సైబర్ క్రైం శ్రీకాళహస్తిలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి పట్టణం గాంధీవీధికి చెందిన మునస్వామి తిప్ప ప్రాంతం ఆర్టీసీ రోడ్డులో ప్రొవిజన్‌షాప్‌ను నిర్వహిస్తుంటాడు. బుధవారం రాత్రి ఇద్దరు యువకులు సరుకులు కొనుగోలు కోసం మునస్వామి దుకాణానికి వచ్చారు. రూ.5వేలకు సరుకులు కొనుగోలు చేసిన తరువాత తమ వద్ద రూ.వెయ్యి నగదు మాత్రమే ఉందన్నారు. మిగతా రూ.4వేలను ఫోన్‌పే చేసేందుకు తమ సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయిందని నమ్మించారు. దుకాణదారుడి సెల్‌ఫోన్ నుంచి తమ నాన్నకు ఫోన్ చేసి మిగిలిన రూ.4వేలను ఫోన్‌పై ద్వారా జమ చేస్తామని నమ్మించారు. దీంతో మునస్వామి వారికి ఫోన్ ఇచ్చాడు. ఒక యువకుడు దుకాణదారుడిని మాటల్లో పెట్టాడు. మరో యువకుడు మునస్వామి సెల్‌ఫోన్‌లో ఫోన్‌పేను ఆపరేట్ చేసి తిరిగి అప్పగించాడు. ఆ తరువాత కొనుగోలు కోసం వచ్చిన యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాసేపటి తరువాత బ్యాంకు ఖాతా నుంచి రూ.81వేలు నగదు మాయమైనట్టుగా మునస్వామికి మెసెజ్ వచ్చింది. దాంతో ఒకసారిగా ఏం జరిగిందోనని ఆందోళనకు గురయ్యాడు. సరుకుల కొనుగోలు కోసం వచ్చిన ఇద్దరు యువకులకు ఫోన్ ఇవ్వడం కారణంగా నగదు లూటీ అయినట్లు గుర్తించి బాధితుడు గురువారం శ్రీకాళహస్తి 1 టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఈ ఘటనపై పోలీసు కేసు నమోదు కాలేదని బాధితుడు తెలిపాడు.

## హత్యకేసుపై ఎస్పీ సీరియస్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని జరిగిన హత్య ఉదంతంపై తిరుపతి ఎస్పీ హర్షవర్ధన రాజు సీరియస్‌గా స్పందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిసరాల్లో గడచిన రెండు వారాల్లో మూడు అనుమానాస్పద మరణాలు, హత్య వెలుగుచూసిన విషయం తెలిసిందే. వరుసగా ఒంటరి వ్యక్తులు హతమవుతుండటంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 16న శుక్రవారం 'ఏం జరుగుతోంది' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఎస్పీ స్పందించారు. మొదట మూడు అనుమానాస్పద మరణాలు వెలుగులోకి వచ్చినప్పటికీ ఎందుకు ఆదిలోనే ప్రత్యేక దృష్టి సారించలేదని శ్రీకాళహస్తి పోలీసులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఇక నాల్గో ఘటన ముక్కంటి ఆలయ సమీపంలోని శ్మశాన వాటికలో గుర్తు తెలియని యువకుడిని దారుణంగా హతమార్చిన అంశంపై స్థానిక పోలీసులను లోతాగా ఆరా తీశారు. హత్య జరిగి మూడు రోజులు అయినప్పటికీ కనీసం హతమైన యువకుడు ఎవరు అన్న వివరాలను ఎందుకు గుర్తించలేకపోయారని నిలదీసినట్లు సమాచారం. మృతదేహానికి రక్తపు మరకలను కూడా మూడు రోజుల నుంచి ఎందుకు శుభ్రం చేయలేదని ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేయడంతో స్థానిక పోలీసు అధికారులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చ్యూరీకి చేరుకుని మృతదేహం ముఖంపై ఉన్న రక్తాన్ని శుభ్రం చేయించారు. హత్య జరిగిన శ్మశానానికి చేరుకుని ఆనవాళ్ల సేకరణ చేపట్టారు. వేగవంతంగా హత్య కేసును ఛేదించాలని ఎస్పీ స్థానిక పోలీసులను ఆదేశించారు. దీంతో రెండు బృందాలుగా పోలీసులు ఏర్పడి గాలింపు ముమ్మరం చేశారు.

# ప్రభుత్వ భూమికి అడ్డదారిలో డీకేటీ పట్టా!

● అడంగల్‌లో నమోదు

● ఫ్రీ హోల్డ్ భూముల పునఃపరిశీలనతో వెలుగు చూసిన వైనం

పుత్తూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ పరిధిలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. నందిమంగళం లెక్కదాఖలాల్లోని సర్వే నెం.6/2లో 3.76 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి అవినీతికి పాల్పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లను కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. 2003కు ముందు ప్రభుత్వ భూములకు పట్టా పొందిన లబ్ధిదారులకు సర్వ హక్కులు కల్పిస్తూ ఫ్రీహోల్డ్ పద్ధతిని అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఫ్రీహోల్డ్ ప్రక్రియలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని ఫిర్యాదులు అందడంతో ప్రస్తుత ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ఫ్రీ హోల్డ్ భూముల జాబితాను పునఃపరిశీలించాలని రెవెన్యూ శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్రీహోల్డ్ జాబితాను పరిశీలించిన రెవెన్యూ అధికారులకు వాస్తవాలు వెలుగు చూశాయి.

**ఏం జరిగిందంటే..**

చిత్తూరు సంతపేటకు వెంకటపెరుమాళ్ భార్య సుబ్బలక్ష్మమ్మకు 1991లో డీకేటీ పట్టా (నెం.52/4/91) జారీ చేసినట్లు నకిలీ పత్రం రూపొందించినట్లు ఆరోపణలున్నాయి. చిత్తూరుకు చెందిన మహిళకు పుత్తూరులో భూమి కేటాయించడంపై విమర్శలున్నాయి. అయితే, భర్త మరణానంతరం సుబ్బలక్ష్మమ్మ పుత్తూరులోని రెండో కుమార్తె నాగరత్నమ్మ వద్దకు వచ్చినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అప్పటికే 65 ఏళ్ల వయసున్న ఆమె.. కుమారులు బాలసుబ్రమణ్యం, హరినాథశెట్టి, శ్రీనివాసులుశెట్టి, కుమార్తెలు విజయ, నాగరత్నమ్మ, లలితకు వివాహాలు చేశారు. ఈ వివరాలను తన కుమార్తె నాగరత్నమ్మ పేరిట 1991 మే 7న రాసిన వీలునామాలో పొందుపరిచారు. అసలు 65 ఏళ్ల వయస్సులో సుబ్బలక్ష్మమ్మకు డీకేటీ భూమి ఎందుకు ఇచ్చారనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. కాగా, 2016 జనవరి 14న సుబ్బలక్ష్మమ్మ మృతి చెందారు. ఆ తర్వాత నాగరత్నమ్మ 2018 జూన్ 26న తన భర్త కుప్పుస్వామి పేరిట రిజిస్టర్ వీలునామా రాశారు. ఆయన కుమారుల పేరిట రిజిస్టర్ చేశారు. పాసుపుస్తకం, ఆన్‌లైన్ అడంగళ్‌లో పేర్లు నమోదు వంటివి శరవేగంగా జరిగిపోయాయి. వీరి కుటుంబం వైసీపీలో కొనసాగుతుండటంతో తమ పరపతిని వినియోగించి ఎవరికీ అనుమానాలు తలెత్తకుండా ఫ్రీ హోల్డ్ జాబితాలో చేర్చినట్లు విమర్శలున్నాయి. 3.76 ఎకరాలకు ఏడు అడుగుల ఎత్తుతో ప్రహరీ నిర్మించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఫ్రీ హోల్డ్ భూములను పునఃపరిశీలించే ఈ క్రమంలో ఈ విషయం వెలుగు చూసింది. రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో ప్రస్తుతం ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. 40 ఏళ్లుగా తమ ఆధీనంలో భూమి ఉందంటూ, మామిడి, ఇతర పంటలు వేసినట్లు కుటుంబ సభ్యుడు నరసింహారావు చెబుతుండటం గమనార్హం.

**అభ్యంతరకరంగా డీకేటీ జారీ**

డీకేటా పట్టా జారీ అభ్యంతరకరంగా ఉంది. నిబంధనలకు అనుగుణంగా పట్టాదారు వివరాలు రిజిస్టర్‌లో నమోదు కాలేదు. ఇవేవి లేకున్నా ఫ్రీహోల్డ్ జాబితాలో నమోదైంది. ఈ వివరాలను ఆర్డీవో, జేసీకి నివేదించా.

– వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు




# యువకుడిని ఢీకొన్న టిప్పర్

● పరిస్థితి విషమం ● గ్రామస్తుల ఆగ్రహం ● టిప్పర్ల అడ్డగింత

కోట, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడిని గ్రావెల్ టిప్పర్ ఢీకొంది. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో గ్రామస్తులు ఆగ్రహించారు. టిప్పర్లను అడ్డుకున్నారు. దీంతో సాగరమాల రోడ్డు పనులకు గ్రావెల్ సరఫరా చేసే వందలాది టిప్పర్లు ఆగిపోయాయి. స్థానికుల కథనం మేరకు.. కోట మండలం ఊనుగుంటపాళెం గ్రామానికి చెందిన యువకుడు అరుణ్‌తేజ గురువారం రాత్రి మైక్రో టవర్ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా ఒక టిప్పర్ వేగంగా వచ్చి అతడిని ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ పరిస్థితి విష మంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ యువకుడిని చూసి గ్రామస్తులంతా ఊనుగుంటపాళెం వద్ద సాగర మాల రోడ్డు పనులకు గ్రావెల్ తరలిస్తున్న సుమారు వందకు పైగా టిప్పర్లను అడ్డుకున్నారు. యువకుడిని ఢీకొట్టిన టిప్పర్ డ్రైవర్ ముందుకు రావాలని కోరారు. ఎవ్వరూ రాకపోవడంతో రోడ్డుపైనే సాయంత్రం వరకు టిప్పర్లను కదలనివ్వలేదు.



ఊనుగుంటపాళెం వద్ద టిప్పర్‌లను అడ్డుకుని ఉన్న గ్రామస్తులు

# ఏఎంపురంలో మళ్లీ గ్రావెల్ తవ్వకాలు

సత్యవేడు, మే 16 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం ఏఎంపురంలో గ్రావెల్ తవ్వకాలు మళ్లీ జోరందుకున్నాయి. ఇక్కడి ప్రైవేట్ భూముల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రావెల్ తవ్వకాలకు ఐదేళ్ల కాలపరిమితికి అనుమతులు పొందిన కొందరు చెన్నైకు చెందిన మట్టి మాఫియా మళ్లీ జూలు విదిలిస్తోంది. అప్పటి అనుమతులను అడ్డం పెట్టుకుని గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్నారు. నాలుగేళ్లుగా అడ్డు అదుపులేకుండా సాగించిన గ్రావెల్ రవాణా ధాటికి సత్యవేడు- టీపీకోట రోడ్డు పూర్తిగా ధ్వంసమై ప్రజలు ఇప్పటికీ కష్టాలు అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పది నెలలుగా స్తబ్దుగా ఉన్న మట్టి మాఫియా మళ్లీ పేట్రేగుతోంది. నాలుగు రోజులుగా పదుల సంఖ్యలో టిప్పర్లతో రాత్రి, పగలు తేడా లేకుండా చెన్నైకు గ్రావెల్ తరలిస్తున్నారు. టిప్పర్లను రోడ్డుకిరువైపులా భారీగా నిలిపి వేయడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి. మరో వైపు ఏఎంపురంలో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతానికి సమీపంలోనే రిజర్వ్ ఫారెస్ట్ కూడా ఉంది. ఈ అటవీ ప్రాంతంలో నెమళ్ళు, జింకలు తదితర వన్యప్రాణులు విరివిగా ఉన్నాయి. ఈ గ్రావెల్ తవ్వకాల పర్యావరణ, జీవవైవిధ్యానికి విఘాతం కలుగుతోందని ప్రజలు ఆవేదన వ్యకం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి గ్రావెల్ తవ్వకాలను నియంత్రించాల్సిన అవసరం ఉంది.



ఏఎంపురంలో జరుగుతున్న గ్రావెల్ రవాణా

## శ్రీవారి సేవలో జాస్తి చలమేశ్వర్

తిరుమల, మే16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి, 16వ ఆర్థిక సంఘం సభ్యుడు సౌమ్య కాంతి ఘోష్, తెలంగాణ ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ప్రముఖ సినీనటుడు కృష్ణ సోదరుడు, సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరి రావు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



ఆలయం ముందు జస్టిస్ జాస్తి చలమేశ్వర్

## ఇద్దరు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్‌లు

కోట, మే 16 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం కేశవరం సచివాలయంలో పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్ అనీల్, వ్యవసాయశాఖ అసిస్టెంట్ శివకుమార్‌లకు శుక్రవారం ఎంపీడీఓ దిలీప్‌కుమార్ నాయక్ షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వెల్ఫేర్ అసిస్టెంట్ పేదల పెన్షన్‌కు సంబంధించి రూ.2.40లక్షలు, మరో రూ.50వేలను డీఆర్‌డీఏ కార్యాలయానికి చెల్లించకుండా స్వాహా చేశారని ఎంపీడీఓ తెలిపారు. దీనిపై రెండు రోజుల్లోగా నగదు చెల్లించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా వ్యవసాయ అసిస్టెంట్ శివకుమార్ విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు.

## వడదెబ్బకు మహిళా రైతు మృతి



వసంత నిర్మల (పాతచిత్రం)

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం చిట్టత్తూరు పంచాయతీ పరిధిలోని రామలింగాపురం రాజులకండ్రిగకు చెందిన వసంత నిర్మల(39) వడదెబ్బకు గురై మృతి చెందారు. గురువారం ఎండలో పొలంలో పని చేసుకుంటూ అక్కడ వడదెబ్బకు గురై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గురువారం తొట్టంబేడు రెవెన్యూ అధికారులు సర్వే చేసేందుకు వచ్చారు. వసంత పొలంతో పాటు ఐదుగురు రైతులకు చెందిన పొలాల్లో గతంలో బాట ఉండేదని అందుకు అధికారులు సర్వే చేసేందుకు అక్కడికి చేరుకున్నారు. దీనికి వసంత అభ్యంతరం చెప్పడంతో పాటూ వారితో వాగ్వాదానికి దిగింది. అనంతరం పొలం పనులు చేస్తూ తీవ్రమైన ఎండకు అస్వస్థతకు గురై పొలంలోనే మృతి చెందింది.

## కొత్త రేషన్ కార్డులకు సర్వర్ సమస్య

పెళ్లకూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకేవారిని సర్వర్ సమస్య వేధిస్తోంది. మండలంలోని 13 గ్రామ సచివాలయాలోని దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. కొత్త రేషన్ కార్డులతో పాటు, పేర్లు, చిరునామాలో మార్పులు, చేర్పులకు ఈ నెల 15 నుంచి సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీంతో అధిక సంఖ్యలో దరఖాస్తుదారులు సచివాలయాలకు వెళ్తున్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తుంటే సర్వర్ సమస్యతో చాలా ఆలస్యమవుతోందని డిజిటల్ అసిస్టెంట్‌లు చెబుతున్నారు. దరఖాస్తుదారులు వెనుదిరుగుతున్నారు.

## రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా జరగాలి


మాట్లాడుతున్న డీఎస్‌వో శేషాచలం రాజు

సూళ్లూరుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని డీఎస్‌వో శేషాచలంరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం పంపిణీ 17వ తేదీకి పూర్తి చేయాలన్నారు. చౌక దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాటాలు సక్రమంగా పనిచేసే విధంగా ఉండాలని తూకాల్లో తేడా వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్‌వీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి బలిజ సంఘం చేయూత



కుట్టుమిషన్ అందజేస్తున్న బలిజ చేయూత ఫౌండేషన్ నాయకులు

నాయుడుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబానికి చెందిన సారంగం శ్వేతకు నాయుడు పేటలోని ఎంఎస్‌ఆర్ ఇంజనీరింగ్ దుకాణం వద్ద బలిజ సంఘ చేయూత ఫౌండేషన్ నాయకులు కుట్టుమిషన్‌ను శుక్రవారం అందజేశారు. శ్వేత కుటుంబ జీవనోపాధికి కుట్టుమిషన్ ఆసరాగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘ చేయూత ఫౌండేషన్ నాయకులు పగడాల శివప్రదీప్, హంస పృథ్వీచంద్, గడదాసు వెంకటేశ్వర్లు, హంస రామారావు, నీలం హరీ, పసుపులేటి రాజాబాబులు ఉన్నారు.

## కల్యాణం..కమనీయం


గజ, సింహవాహనాలపై వేంచేస్తున్న అమ్మవార్లు, స్వామివారు

నాయుడుపేట టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయ వార్షిక మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి టీటీడీ వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. తొలుత కల్యాణానికి శ్రీదేవి.. భూదేవి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. గజవాహనంపై స్వామివారు, సింహ వాహనంపై విహరిస్తూ నగరోత్సంలో భక్తులను అనుగ్రహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణ ఘడియల్లో పలువురు కల్యాణం చేసుకుని ఒక్కటయ్యారు.

## కరెంట్ కోతలు లేకుండా చూడండి

సూళ్లూరుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో ఇటీవల కాలంలో అప్రకటిత విద్యుత్ కోతలు చేస్తున్నారని వేసవి దృష్టిలో పెట్టుకుని విద్యుత్ కోతలు లేకుండా చూడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్‌కే రియాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండుటెండలు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతుంటే వేళాపాళ లేని విద్యుత్ కోతలు విధించడం తగదని పేర్కొన్నారు. విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరారు. అప్రకటి కోతలు విధిస్తే సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని స్పష్టం చేశారు.

## పేదలకు నిత్యావసరాల పంపిణీ




గూడూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు నెలరోజులకు సరిపడా నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధి ఆర్‌వీ.రావు, గోపీనాథ్‌రెడ్డి, మురళీనాయుడు, మురళీరాజు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఒకరిపై దాడి.. కేసు నమోదు

బాలాయపల్లి, మే16(ఆంధ్రజ్యోతి) మండలంలోని సుబ్రమణ్యం గ్రామానికి చెందిన వుప్పతోట్టి నరసయ్య అనే వ్యక్తిపై అదే గ్రామానికి మచ్చల కిరణ్ అనే యువకుడు భూ వివాదంపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

గూడూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూ వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని వైద్యసిబ్బంది అన్నారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక పూలతోట గిరిజనకాలనీ, తూర్పువీధి ప్రాంతాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల అపరిశుభ్రత వలన దోమలు పెరుగుతాయన్నారు. దోమల వలన డెంగ్యూ వ్యాధి వస్తుందన్నారు. అందువల్ల పరిసరాలలో మురుగునీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, రేష్మ, యాస్మిన్, శకుంతల, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## నవశిశువులకు క్యాప్‌టవళ్ల పంపిణీ



గూడూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శ్రీధర్‌రెడ్డి దాతృత్వంతో నవశిశువులకు క్యాప్‌టవల్స్‌ను పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, శ్రీధర్ రెడ్డి, పీవీ.కృష్ణయ్య, రామ్‌ప్రసాద్, సురేష్, వెంకటేశ్వర్లు, బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు భారీ ర్యాలీతో స్వాగతం

కోట, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్‌లో శుక్రవారం టీడీపీ నాయకులు చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు ఘన స్వాగతం లభించింది. వాకాడు, గొల్లపాళెం పర్యటనకు వెళుతూ విద్యానగర్ చేరుకున్న ఎమ్మెల్యేకు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోట, మే 16 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం చెందోడు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ చిన్నయ్య శుక్రవారం తెలిపారు. మండలంలోని కోట, ఉత్తమనెల్లూరు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, సిద్ధవరం, వంజివాక విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధితో పాటు చెందోడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపి వేస్తామని తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## అమ్మవారిని ఆలయంలో ఉంచాలి



వెంకటగిరిటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేట బీసీ కాలనీలో ఉన్న కాశీ పురాదేశ్వరి అన్నపూర్ణమ్మ విగ్రహాన్ని యథాస్థానంలో ఉంచాలని స్వామి వివేకానంద యువసైన్యం వ్యవస్థాపకులు ప్రకృతికుమార్ కోరారు. ఆలయం కొలువైన స్థలం తమకు చెందినదని కొందరు ఆలయంలోని విగ్రహాన్ని వారంత రోజుల క్రితం వెలుపల ఉంచారు. ఈ క్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

## శివప్రసాద్‌కు శుభాకాంక్షలు


బహుమతి ప్రదానం చేస్తున్న అప్పిన వెంకటేశ్వర్లు

వెంకటగిరి టౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు ఛైర్మన్‌గా శివ ప్రసాద్‌ను ఎంపిక చేయడం సంతోషంగా ఉందని ప్రముఖ అధ్యాపకులు అప్పిన వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన నివాసంలో కలిసి జ్యోతిరావు పూలే చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.





సైనికులకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు విజయశ్రీ, పాశిం సునీల్‌కుమార్ తదితరులు

## ఉగ్రవాదానికి చోటు లేదు

నాయుడుపేట/ వాకాడు/ మే 16 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదానికి చోటులేదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూ విజయవంతం అయిన నేపథ్యంలో నాయుడుపేటలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగ్రవాదులకు ఈదేశంలో చోటు లేదన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మనసైన్యం చలువతోనే మనమంతా ప్రశాంతంగా ఉన్నామని వారిసేవలు ఎనలేనివని కీర్తించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రంగినేని కృష్ణయ్య, రఫీ, గంగాప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, దార్ల రాజేంద్ర, పొట్లపూడి రాజేష్, అవధానం సుధీర్, భాస్కర్, జీవీఆర్ నాయుడు, మస్తాన్, చిగురువాడ అశోక్‌కుమార్, ధనంజయ, సుబ్బారావు, నారాయణ, రవి, ఇమిడిశెట్టి వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు. ● ఆపరేషన్ సింధూ విజయవంతం అయిన నేపథ్యంలో ఎన్డీప కూటమి నాయకులతో కలసి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ వాకాడు అశోక్ పిల్లర్ నుంచి తిరంగా ర్యాలీ నిర్వహించారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు


అజిత్‌కుమార్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

వాకాడు, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో 300 మందికి పైగా వైసీపీని వీడి టీడీపీలో శుక్రవారం చేరారు. తీరప్రాంతాలలో 3 పంచాయతీలకు పైగా పట్టు ఉన్న రావిగుంటపాళెం గ్రామానికి చెందిన దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి తన అనుచరులైన నిడిగుర్తి సర్పంచ్ నాగరాజు, రావిగుంటపాళెం ఇన్‌చార్జి సర్పంచ్ వాకాటి బాలకృష్ణారెడ్డి, పూడిరాయదొరువు ఎంపీటీసీ బండి శోభన, ఈదూరు వెంకటాద్రి, కోట రమేష్, చెంగారెడ్డి రవి, తీపలపూడి చెంగయ్యలతోపాటు మరో 150 మంది వైసీపీని వీడి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. అదే విధంగా కొండాపురం పంచాయతీ నుంచి తుమ్మల మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో అట్ల కస్తూరయ్య, వంకా రమణయ్య, మేకల దశయ్య, పైగాల లింగమ్మ, పల్లాపల్లి సురేష్, మేరిగ సుబ్రహ్మణ్యంలతోపాటు మరో 40 మంది టీడీపీలో చేరారు. వెంకటరెడ్డిపాళెం నెలిపూడి పంచాయతీ నుంచి పల్లా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అట్ల హరీలతోపాటు 50 మంది పార్టీలో చేరారు. వాకాడు పంచాయతీలో భార్గవ్‌రామ్‌శెట్టి, రామలింగారెడ్డి, శివయ్యశెట్టిలు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి, దోశకాయల కృష్ణమూర్తి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, కుంచం దయాకర్, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, చిరంజీవమ్మ, తడివి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా చెన్నకేశవస్వామికి వసంతోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి, వసంతోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

గూడూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కర్ణాలవీధిలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ వసంతోత్సవం నిర్వహించి, మాడవీధి ఉత్సవం జరిపారు. అనంతరం స్వామి అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి చక్రస్నానం వైభవంగా జరిపారు. ఈ పూజాకార్యక్రమాలలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## రికార్డుల తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈవో విద్యారమ, పక్కనే ఎంపీడీవో మురళీకృష్ణ, డీఎల్‌డీవో జాలిరెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): సాధారణ తనిఖీల్లో భాగంగా సూళ్లూరుపేట ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీ సీఈవో విద్యారమ శుక్రవారం పలు రికార్డులను తనిఖీ చేశారు. అలాగే మన్నారు పోలూరులోని టూరిజం కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేయనున్న డీఎల్‌డీవో కార్యాలయ గదులను పరిశీలించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతానికి మన్నారుపోలూరు టూరింజ కాంప్లెక్స్‌లో డీఎల్‌డీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. శాశ్వత భవనం నిర్మాణం పూర్తయ్యేవరకు తాత్కాలికంగా ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్య క్రమంలో ఆమెతో పాటు ఎంపీడీవో మురళీకృష్ణ, డీఎల్‌డీవో జాలిరెడ్డి, పీఆర్ డీఈ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని, సీనియర్ అసిస్టెంట్ రఘునాథరెడ్డి ఉన్నారు.

## ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించండి

వాకాడు, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌డేలో లబ్ధిదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. పలు సమస్య లపై 115 అర్జీలు వచ్చాయి. ఆయా శాఖల అధికారులు అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్య క్రమంలో తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, అధికారులు, టీడీపీ నాయకులు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సన్నారెడ్డి విజయశేఖరరెడ్డి, పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి, పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, దోశకాయల కృష్ణమూర్తి, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, దయాకర్ ఉన్నారు.

## రేషన్ బియ్యం స్వాధీనం

బాలాయపల్లి, మే16(ఆంధ్రజ్యోతి) మండలంలోని జయంపు గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం తెల్లవారు జామున బాలాయపల్లి పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. వెంకటగిరి మండలానికి చెందిన శివనాయుడు సహకారంతో అరవ సురేష్ అనే వ్యక్తి బాలాయపల్లి మండలంలోని జయంపు కూడలి వద్ద రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తుండగా రాత్రి గస్తీలు నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నారు. ఆటోలో 21 బస్తాల (1021 కేజీలు) బియ్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం

సూళ్లూరుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో ప్రజలు అర్జీ రూపంలో ఇచ్చే ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఆమె ప్రజల నుంచి సమస్యల పై అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వివిధ సమస్యల పై మొత్తం 103 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, టీడీపీ నాయకులు సతీష్, గాడి నారాయణ రెడ్డి, శ్రీనివాసుల నాయుడు, మేడా సాయి నారాయణ తదితరులు ఉన్నారు.

## డెంగ్యూపై అవగాహన ర్యాలీ



తడ, మే 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక సీహెచ్‌సీ వైద్యులు కిషోర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ వ్యాధి నివారణకు తీసుకో వాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## గాయపడిన విద్యార్థి మృతి

సూళ్లూరుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని షార్ ఉద్యోగుల కాలనీ పులికాట్ నగర్ (కేఆర్‌పాలెం)లోని అంతరిక్ష కేంద్రీయ పాఠశాల మూడో అంతస్తు భవనం పై నుంచి పడి గాయపడిన పదో తరగతి విద్యార్థి ఇస్రాత్ అలీ (15) చెన్నైలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పాఠశాలలో విద్యార్థులకు వేసవి తరగతులు నిర్వహి స్తున్నారు. ఈ క్రమంలో గురువారం విరామ సమయంలో తోటి విద్యార్థులతో కలిసి ఇస్రాత్ అలీ ప్రమాదవశాత్తు పడి తీవ్రంగా గాయపడ్డారు. చెన్నైకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్‌ఐ రామ్మూర్తి విద్యార్థి పోస్టుమార్టం నిమిత్తం చెన్నైకి వెళ్లారు. కేసు నమోదు చేశారు.

## నేడు తిరంగా యాత్ర

డక్కిలి, మే 16 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తిరంగ యాత్ర చేపట్టనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తెలియజేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో ఒకరికి తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట-తుమ్మూరు సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. పట్టణంలోని మునిరత్నం నగర్ కాలనీకి చెందిన హుస్సేన్ ద్విచక్ర వాహనంలో నాయుడుపేటకు వస్తుండగా ఆటో ఢీకొంది. హుస్సేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరుకు తరలించారు.

## హెల్మెట్ ధరించాలి

గూడూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రెండోపట్టణ పరిధిలోని పాతసంతరోడ్డు సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో ధ్రువీకరణ పత్రాలను ఉంచుకోవాలన్నారు.

## డీఈవో, సెక్యూరిటీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి రూరల్, మే16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బైరాగి పట్టెడలోని మాస్ సంస్థ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగాలకు 10వ తరగతి ఆపై విద్యార్హతతోపాటు ఫిజికల్ ఫిట్‌నెస్‌కి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. డీఈవో ఉద్యోగాలకు డిగ్రీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలన్నారు. వివరాల కోసం 9392275861ను సంప్రదించాలని కోరారు.

## ప్రమాదాలకు నిలయాలుగా మలుపులు

గూడూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాలలో మలుపులు, కూడళ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. పట్టణ జనాభా పెరగడం, గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనుల మీద వచ్చే ప్రజలతో నిత్యం రద్దీగా మారుతోంది. దీంతో వాహనాల సంఖ్య పెరిగింది. ప్రధానంగా గూడూరు ఆర్టీసీ బస్టాండు నుంచి ఆస్పత్రి రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్‌కు, రైల్వేస్టేషన్ రోడ్డు మార్గంలో వివేకానంద రోడ్డు మీదుగా శాంతినగర్ అండర్‌బ్రిడ్జి నుంచి రెండో పట్టణానికి, రాపూరు, వెంకటగిరి వైపు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఈ మార్గంలోనే ఎక్కువగా వాహనాల రద్దీ ఉంటుంది. ఆర్టీసీ బస్టాండు నుంచి పట్టణానికి వచ్చే మార్గంలో సంగం థియేటర్ సెంటర్ వద్ద మూడు రోడ్ల కూడలితో పాటు మలుపు తిరగాల్సి ఉంటుంది. ఆస్పత్రి రోడ్డులో చందమామ ఐస్‌క్రీమ్ సెంటర్ వద్ద మూడురోడ్ల కూడలి, మోతీమహల్ సెంటర్ వద్ద నాలుగు రోడ్ల కూడలి, ఏరియా ఆస్పత్రి వద్ద, పాతబస్టాండు వద్ద, రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో మలుపు వద్ద, శాంతినగర్ అండర్‌బ్రిడ్జి మలుపు వద్ద, రెండోపట్టణ పరిధిలోని ఎస్‌ఆర్‌ఏ సెంటర్ వద్ద, జీఎస్‌రాయులు సెంటర్ వద్ద గల మలుపులలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా వాహనాల సంఖ్య పెరగడంతో ఈ ప్రధాన రహదారిపై వాహనాలను వేగంగా నడుపుతుండడం వలన ఇటు కూడళ్ల వద్ద, అటు మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. అంతేకాకుండా ఈ ప్రాంతాలలో రోడ్డు దాటే సమయాలలో పాదచారులను సైతం వేగంగా వచ్చే వాహనాలు ఢీకొని పలువురు గాయాలపాలయ్యారు. ఈ ప్రధాన రహదారిలోని మలుపులు, కూడళ్ల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు వేగనిరోధకాలను ఏర్పాటు చేస్తే కొంతవరకు ప్రమాదాలను నివారించవచ్చునని స్థానికులు అంటున్నారు.

### స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలంటున్న జనం




సంగం థియేటర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు, మూడు రోడ్ల కూడలి, రైల్వేస్టేషన్ వద్ద మలుపు, రెండోపట్టణ పరిధిలోని ఎస్‌ఆర్‌ఏ సెంటర్ వద్ద మలుపు

## ముక్కంటి సేవలో ఇస్రో చైర్మన్



ధ్వజస్తంభం వద్ద ఇస్రో చైర్మన్ నారాయణన్ సహా కుటుంబీకులు

శ్రీకాళహస్తి, మే 16 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శుక్రవారం ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమంత, గజవాహనాలపై వెంకన్న విహారం





హనుమంత, గజ వాహన సేవలు

నారాయణవనం, మే 16(ఆంధ్రజ్యోతి): పద్మావతి సమేత కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం హనుమంతు వాహనంపై, రాత్రి గజ వాహనంపై శ్రీవారు విహరించి భక్తులపై వరాల జల్లు కురిపించారు. ఉదయం 4గంటలకు సుప్రభాతసేవలో మేల్కొలిపి స్వామికి నిత్య పూజా కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. నిత్య శుద్ధి, తోమాల, అర్చన, గంట, నైవేద్యం తదితర సేవలను పూర్తి చేశారు. అనంతరం స్వామివారిని హను మంత వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. తదనంతరం స్వామివారిని సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న కు వసంతోత్సవాన్ని నిర్వహించి, పుర వీధుల్లో ఊరేగించారు. రాత్రి స్వామివారు గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరిటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్‌భట్టాచార్య, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పుత్తూరు వార్తలు

## కవి నాగరాజుకు సత్కారం



నాగరాజును సన్మానిస్తున్న నిర్వాహకులు

వడమాలపేట, మే 16(ఆంధ్రజ్యోతి): పెహల్గాం దుర్ఘటనపై కవితా సంపుటిని సమర్పించిన ఉపాధ్యాయుడు నాగరాజు పరాంకుశాన్ని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో తెలుగు సమాఖ్యల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పెహల్గాం దుర్ఘటనపై వెలువరించిన కవితా సంకలనాలకు సంబంధించి తిరుపతి జిల్లా నుంచి నాగరాజు పరాంకుశకు ఆహ్వానం అందింది. 'మోదీకి చెప్పమన్నవన్నీ దేశమంతా విన్నామని' శీర్షికగా ఆయన పంపిన కవితా సంపుటిని ప్రముఖులు కొనియాడారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, కరీంనగర్ భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తక ఆవిష్కరణ సభలో నాగరాజును సన్మానించి, ప్రశంసాపత్రం అందజేశారు. శతాధిక గ్రంథ ప్రచురణకర్త వైరాగ్యం ప్రభాకర్, తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ హరికృష్ణ, సాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శి బాలాచారి, విశ్వంభర పత్రికా సంపాదకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా నాగరాజు పరాంకుశ వడమాలపేట మండలం సీతారామపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు.

## తడుకు టీడీపీ అధ్యక్షుడిగా హరికృష్ణ



పుత్తూరు టౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తడుకు పంచాయతీ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షు, కార్యదర్శులుగా హరికృష్ణ, రాజేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు శుక్రవారం సాయంత్రం గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, పార్టీ పరిశీలకుడు రవినాయుడు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో నాయకులు కరుణాయాదవ్, సర్పంచ్ బొబ్బలి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కపోతకు వర్షంతో ఉపశమనం

పుత్తూరు,మే16(ఆంధ్రజ్యోతి): రోజంతా ఉక్కపోతకు గురైన పట్టణ ప్రజానీకానికి సాయంత్రం గంటపాటు కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. ఆకాశమంతా దట్టమైన మబ్బులు కమ్ముకుని ఉరుములు మెరుపులతో వర్షం పడింది. దాదాపు 30 మి.మీ వర్షం పడిందని రెవిన్యూ అధికారులు అంచనా వేశారు. ఈ వర్షం పల్లె ప్రాంతాల్లో పడకుండా కేవలం పట్టణంలోనే పడడం విశేషం.

## సంకటహర చతుర్థి



వడమాలపేట,మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం సంకటహర చతురి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం వినాయకుడి విగ్రహానికి పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం మూలవిరాట్టును పట్టువస్త్రాలు, పూలతో అలంకరించి స్తోత్రాలు పఠిస్తూ పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## చదువు పూర్తవ్వగానే చిరుద్యోగంలోనైనా చేరండి



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు

పుత్తూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): చదువు పూర్తయిన వెంటనే చిరుద్యోగంలోనైనా చేరి జీవితంలో క్రమంగా ఎదగాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ, సీడాప్, డీఆర్‌డీఏ లు సంయుక్తంగా శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థి దశలోనే నైపుణ్యాన్ని సంపాదించుకోవాలన్నారు. కళాశాల నుంచి బయటకు వెళ్లేటప్పుడు డిగ్రీతో పాటు స్కిల్స్ సర్టిఫికెట్‌ను కూడా తీసుకోవాలని సూచించారు. దాదాపు 25 బహుళ జాతీయ సంస్థలు పాల్గొన్న ఈ మేళాలో ఇంటర్వ్యూలకు హాజరైన 284 మంది అభ్యర్థుల్లో 161 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. ఈ కార్యక్రమంలో గుణశేఖర్‌రెడ్డి, అభిరామ్, నటరాజన్, శ్రుతి, అధ్యాపకులు వీరయ్య, నరసింహులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి
# సత్యవేడు

### విద్యా సామగ్రి వితరణ

బుచ్చినాయుడుకండ్రిగ, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంపాళెం సీఎస్‌ఐ చర్చిలో వేసవి సెలవుల శిబిరం జరిగింది. ఐసీఎస్‌ఎ ఏపి రాష్ట్ర కోఆర్డినేటర్ విజయకుమారి మాట్లాడుతూ మండలంలో వందమంది పేద విద్యార్థులకు విద్యా సామగ్రి, నగదు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగని స్టార్టర్లు, కేబుళ్ల చోరీ





చెల్లూరు, కుమ్మరకండ్రిగల్లో చోరీకి గురైన స్టార్టర్లు

ఏర్పేడు, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలో పొలాల వద్ద బోర్లకు ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లు, స్టార్టర్లను గుర్తు తెలియని దుండగులు రాత్రివేళల్లో అపహరించుకుపోతున్నారు. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెల్లూరు, కుమ్మరికండ్రిగ, గుండ్లకండ్రిగల్లో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు సుమారు 30 బోర్ల స్టార్టర్లను, కేబుల్ వైర్లను అపహరించుకుపోయారు. ఈనెల 12న సోమవారం రాత్రి మండలంలోని సరస్వతి కండ్రిగలో 30మంది రైతులకు సంబంధించి 50 స్టార్టర్లు, కేబుల్ వైర్లు చోరీ అయిన విషయం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై ఏర్పేడు పోలీసులకు రైతులు ఫిర్యాదు చేశారు. పదేపదే చోరీలు జరుగుతుండడంతో రైతులు దిక్కు తోచని స్థితికి చేరుకున్నారు. వేసవి కావడంతో పంటలకు నీరు పట్టడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

## శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజి వినాయక స్వామి ఆలయం వద్ద సంకటహర చతుర్థి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి కుటుంబం గణపతి హోమం నిర్వహించుకునే విధంగా ఆలయ అధికారులు సంకట చతుర్థి హోమాన్ని ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఇందులో భాగంగా శుక్రవారం అంజంజి గణపతి ఆలయం లో పూజలు చేశారు. కలశ స్థాపన అనంతరం గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి):** మండలంలోని సిద్ధిరాజు కండ్రిగలో హనుమంతీశ్వరాలయంలో శుక్రవారం సంకట హర చతుర్థిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశ మంత్రోచ్చారణ, వ్రతం, కథా పారాయణం, హారతి, ప్రసాద వితరణ జరిగాయి.

## పాఠశాలలను పరిరక్షించుకుందాం: ఏపీటీఎఫ్

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): పాఠశాలలను పరిరక్షించుకుందామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు పాఠశాలల మూసివేతకు కారణమవుతున్నాయన్నారు. ఫౌండేషన్ స్కూల్ పేరుతో కేవలం 1, 2 తరగతులలో మాత్రమే ఏర్పడి పాఠశాలలు క్రమేణా కనుమరుగు కానున్నాయన్నారు. వెంటనే ఈ ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు 16, 17 తేదీల్లో డిమాండ్లతో కూడిన లేఖను మంత్రి లోకేశ్‌కు మెయిల్, వాట్సప్ ద్వారా పంపాలన్నారు. అదే విధంగా 18, 19 తేదీల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర ప్రజాప్రతినిధులకు సమర్పించాలని తెలిపారు. వెంకటాద్రి, వెంకటేశ్వర్‌రెడ్డి, చెంచురాజు తదితరులు పాల్గొన్నారు.

## గేట్‌లో సత్తా చాటిన పవన్‌కుమార్



పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న కళాశాల నిర్వాహకులు

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక గేట్ పరీక్షలో పట్టణానికి చెందిన చుక్కల సుబ్బారావు కుమారుడు చుక్కల పవన్‌కుమార్ సత్తా చాటాడు. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ విద్యార్థుల మధ్య తీవ్ర పోటీ ఉండే గేట్ పరీక్షల్లో పవన్ కుమార్ ఉత్తీర్ణత సాధించాడు. గేట్‌లో ఉత్తీర్ణత సాధించడంతో ఉన్నత విద్య చదివేందుకు నెలకు రూ.10వేలు చొప్పున జాతీయ ఉపకార వేతనం పొందేందుకు అర్హత సాధించాడు. పవన్‌కుమార్ మదనపల్లిలోని మిట్స్‌లో ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు.

## సెక్యూరిటీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి రూరల్, మే16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బైరాగిపట్టెడలోని మాస్ సంస్థ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగాలకు 10వ తరగతి ఆపై విద్యార్హతతోపాటు ఫిజికల్ ఫిట్‌నెస్‌కి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. డీఈవో ఉద్యోగాలకు డిగ్రీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి విద్యార్హత ఉన్న వారు ఈనెల 19వ తేదీలోపు బైరాగిపట్టెడలో పద్మావతిపార్క్ వెనుక ఉన్న మాస్ సంస్థల్లో నేరుగా సంప్రదించాలని కోరారు. వివరాల కోసం 9392275861ను సంప్రదించాలని కోరారు.

## ప్రభుత్వ ఆశయాలకనుగుణంగా పని చేయండి





దాణా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

సత్యవేడు/ నాగలాపురం మే 16: ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు పని చేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. శుక్రవారం సత్యవేడులోని అగ్రిటెస్టింగ్ ల్యాబ్, నాగలాపురం మండలం కృష్ణాపురంలలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన దాణా పంపిణీలకు ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయా సందర్భాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంబంధిత అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని రైతులకు చేర్చాల్సి ఉందన్నారు. వెటర్నరీ ఏడీఏ గోవింద భాస్కర్, డాక్టర్లు దయాకర్, పార్థిబన్, అగ్రికల్చర్ ఏఈ మురళి, ఎస్‌ఐ రామస్వామి, నాయకులు యుగంధర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, సెల్వకుమార్, కోళ్ళ చిన్న, బాలమురళి కృష్ణ, వెంకటరమణ, పీఎస్‌రాజు, జడేరి బాబు, పార్తిబన్, ధనశేఖర్ అడ్వకేట్ రాజా తదితరులు

### సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నాగలాపురం మండలంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధ పడుతూ ఆస్పత్రుల్లో ప్రైవేటుగా చికిత్సలు పొందిన మండలంలోని చిన్నాపట్టుకు చెందిన శరవణన్, నాగలాపురానికి చెందిన గిరిబాబుకు శుక్రవారం రూ.4,36,350 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

## డెంగ్యూపై అప్రమత్తం



బీఎన్‌కండ్రిగలో సిబ్బంది ప్రతిజ్ఞ

బుచ్చినాయుడుకండ్రిగ, మే 16 (ఆంధ్ర జ్యోతి): డెంగ్యూ జ్వరాలపై ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని డాక్టర్లు విద్యాసాగర్, మురళీధర్‌రెడ్డి తెలిపారు. జాతీయ డెంగ్యూ దినం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెంగ్యూ ఒక దోమ వలన వస్తుందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే డెంగ్యూ దోమలు ప్రబలుతాయన్నారు. ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**సత్యవేడు (ఆంధ్రజ్యోతి):** డెంగ్యూ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి హర్షవర్ధన్ తెలిపారు. శుక్రవారం డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ ప్రధానంగా ఎడిస్ దోమలు పగటిపూట కుట్టడం వల్ల డెంగ్యూ జ్వరాలు ప్రబలుతాయని వివరించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు.

**వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఇందిరానగర్, లక్ష్మీనగర్‌లో ఎడిస్ దోమల నివారణకు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఉదయ్‌కుమార్ అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది మధుసూదన్, శాంతి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలందించండి

ఏర్పేడు, మే 16(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి బాలకృష్ణనాయక్ సూచించారు. ఏర్పేడు ప్రాథమిక వైద్యశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఎఫ్‌ఆర్‌ఎస్, ఓపీ సేవలు, ఈహెచ్‌ఆర్, హైరిస్కు కాన్పుల డేటా ఇతర జాతీయ కార్యక్రమాలపై సమీక్షించారు. ఎన్‌సీడీ, సీడీ సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యాధికారి శివప్రియ, సీహెచ్‌వో శివరాజు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారత సైన్యానికి సంఘీభావంగా తిరంగ యాత్ర



వరదయ్యపాళెం, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో భారత సైన్యానికి సంఘీభావంగా తిరంగ యాత్ర శుక్రవారం జరిగింది. బస్టాండు నుంచి ఈ యాత్ర దేశభక్తిని చాటేలా సాగింది. విద్యార్థులు, యువత, పౌరులు పాల్గొని జాతీయ పతాకాలు చేతబట్టి భారత్‌మాతాకీ జై... వందేమాతరం, జై జవాన్ నినాదాలతో హోరెత్తించారు. మురళి, డిల్లీప్రకాష్, సూర్యనారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు పరిష్కారం

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో శుక్రవారం తాగునీటి సమస్య పరిష్కారమైంది. సమస్యను స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన పురపాలకసంఘ డీఈ సంజయ్‌కుమార్‌ను మరమ్మతులు చేయాలని కోరారు. దీంతో సిబ్బంది ఎన్టీఆర్‌నగర్ పైపులైన్‌ను మొత్తం పరిశీలించి బాగు చేసి సమస్య తలెత్తకుండా చేశారు. ఈ సందర్భంగా టీడీపీ వార్డు ఇన్‌చార్జి, రాష్ట్ర సాంస్కృతిక విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్.బుజ్జి మాట్లాడుతూ పట్టణంలోని ఏ ఒక్క ఇంటికి కూడా నీటి సమస్య లేకుండా ఉండాలన్నదే ఎమ్మెల్యే ఆలోచన అన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి(ఆటోనగర్), మే 16(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ కోరారు. వేమన విజ్ఞాన కేంద్రంలో అంగన్‌వాడీల రాష్ట్ర తరగతులను ఆమె శుక్రవారం ప్రారంభించి మాట్లాడుతూ వేతనాల పెంపుకోసం గత ఏడాది 42 రోజులు సమ్మె చేసినా వైసీపీ ప్రభుత్వం సహకరించలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా వేతనాల పెంపుపై ఇప్పటివరకు జీవో విడుదల చేయకపోవడం సరికాదన్నారు. జూలై 9వ తేదీలోపు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, యూనియన్ నేతలు లక్ష్మీదేవమ్మ, రాజేశ్వరి, ఇంద్రాణి, హైమావతి, సౌజన్య, రేవతి, నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే వర్క్‌ఫ్రం హోం అంటూ కొందరూ మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, యువత తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీ, సీవీవీ నెంబర్లు, పాస్‌వర్డ్‌లో ఎవరికీ చెప్పకూడదన్నారు. అపరిచితుల చేతికి ఫోన్ ఇవ్వవద్దని సూచించారు.

## సీఎంతో మాజీ ఎమ్మెల్యే హేమలత భేటీ



సత్యవేడు, మే 16 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత శుక్రవారం సీఎం చంద్రబాబును అమరా వతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న వివిధ సమస్యలపై సీఎంకు హేమలత వివరించినట్లు తెలిపారు. తన వినతులపై సీఎం సాకూలంగా స్పందించారని, త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు హేమలత తెలిపారు.

## హరిప్రసాద్‌కు సన్మానం



సత్యవేడు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్‌ను సత్యవేడు నియోజకవర్గ జనసేన నాయకుడు బాల మురళీకృష్ణ తిరుపతిలోని ఆయన నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. హరిప్రసాద్ ఇటీవల రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా ఆయన్ను కలిసి పుష్పగుచ్చం, శాలువాతో సన్మానించారు. తడ శ్రీనివాసులు, విజయ్ కుమార్, రెడ్డిశేఖర్, రూప్‌కుమార్ పాల్గొన్నారు.

## చిన్నపాండూరు వైద్యాధికారిగా ప్రశాంత్

వరదయ్యపాళెం, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాండూరు ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిగా కె.ప్రశాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తుండిన వైద్యాధికారి బదిలీపై వెళ్లగా, మరో వైద్యాధికారి లావణ్యను విజయవాడ వైద్య ఆరోగ్యశాఖకు సరెండర్ చేశారు. ఈ నేపథ్యంలో వరదయ్యపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి ద్వైతను ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. కదిరిలో బాధ్యతలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ప్రశాంత్ ఇక్కడకు బదిలీ అయ్యారు.